
# పిచ్చోడు



మనాశ్రి

కవితలు

# పిచ్చోడు

## (కవితా సంపుటి)

విచ్చలవిడితనాలు, విలాస జీవితాలు...

ఎలా సంపాదించామన్నది కాదు
ఎలా బతుకుతున్నామన్నదే ముఖ్యం.

నిజాన్ని నిలదీసినా, నిస్వార్థంగా పనిచేసినా,
వ్యవస్థలోని లోపాన్ని వేలెత్తి చూపినా,
నిజాయితీగా ఉన్నా... వాడు పిచ్చోడు.

మంచి వ్యక్తిత్వానికి ప్రస్తుత సమాజం కలిగిస్తున్న దుస్థితి.
అవినీతిని చట్టబద్ధం చేయాలని, లంచం తీసుకోని వాడిని
ఉరి తీయాలనీ శాసనాలు వచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదేమో!

మనోశ్రీ

# పిచ్చోడు

కవితా సంపుటి

**మనాశ్రీ**

సర్వస్వామ్యాలు రచయితవి

ప్రథమ ముద్రణ: సెప్టెంబర్, 2014

ప్రతులు: 1,000

ముఖచిత్రం: బ్నిం

వెల: **రు. 50/-**

ప్రతులకు:

**మద్దూరి వెంకట విజయలక్ష్మి**
7-6-7, మసీదు వీధి, కొవ్వూరు - 534 350, ప॥గో॥ జిల్లా
మొబైల్: 94901 10960 / 99855 76938

మరియు

విశాలాంధ్ర అన్ని శాఖలు
గాంధీ జ్ఞానమందిర్ బుక్‌హౌస్, కోఠి, హైదరాబాద్
నవోదయా బుక్ డిస్ట్రిబ్యూటర్స్, బడీచౌడీ, హైదరాబాద్
శ్రీ మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రి
శ్రీ మణికంఠ బుక్ స్టాల్, మెయిన్‌రోడ్, రాజమండ్రి

*e-book available at: www.manasri.com*

డిజైనింగ్ & ముద్రణ:
**రత్న ప్రింటింగ్ వర్క్స్**
విజయవాడ - 520 002
ఫోన్: 9030 663666

# అంకితం



చిన్నతనంలో తండ్రి మరణం – దారి తప్పే యవ్వనం –
మోయలేని కుటుంబ భారం – నిత్యం సమస్యల తాండవం –
ఎటు వెడుతుందో తెలియని జీవితం – అంతా అయోమయం.
నిస్సహాయమైన ఒంటరితనం – నేనెవరో తెలియకపోయినా
తన స్నేహితుని పరిచయంతో నేనున్నానంటూ మానవత్వానికి
సజీవ సాక్ష్యమై నాలో విశ్వాసాన్ని, స్ఫూర్తిని పెంచి నా జీవితానికొక
అర్థాన్ని కల్పించి, నా ఎదుగుదలకు కారణమైన
కీర్తిశేషులు **డా॥ కాసా రమేష్** గార్కి
ఈ కవితా సంపుటి అంకితం.

# శుభమస్తు!!



నానృషిః కురుతే కావ్యం!! అన్నారు –
అంటే ఋషి కానివాడు కావ్యం రాయలేడు...
అని అర్థం –
అలాంటి ఋషి కావాలంటే... కవి ముదరాలి –
అసలు కవి కావాలంటే... చాలా సరంజామా కావాలి!
భాష మీద పట్టు, భావశబలత, శబ్దసౌందర్యం,
అంటే... ఇంచుమించు సరస్వతి కోసం తపస్సు చేయాలి –
ఎంతో విద్యని పిండితే... రాలే రెండు బొట్లే కవి!!
ఇలా... బొట్లు... రాల్చాలంటే – మనశ్రీ బాగా పండాలి!!
ఆ తర్వాత పిండాలి!!
మనశ్రీ మనిషిగా గడుసువాడైనా కవిత్వం పిచ్చోడు.
తప్పకుండా అతన్ని ప్రపంచం
అర్థం చేసుకుంటుంది.

ఆశీః



**(తనికెళ్ల భరణి)**

హైదరాబాద్

18-7-2014



# "మ"నాశ్రీనివాసం

మాస్ట్రో, కళారత్న డా॥ **గజల్ శ్రీనివాస్**
**ప్రముఖ గజల్ గాయకుడు**

మనాశ్రీ నా ఆత్మ బంధువు. నిత్యం నా గజళ్ళు వింటూ నా పాటని, నా బాటని ఆరాధించే సహృదయ మిత్రుడు. పసి పిల్లలు గాలిపటాలు ఎగరేస్తే మనాశ్రీ మాత్రం తన పసి మనసును గాలిపటంలా ఎగురవేస్తాడు. నన్ను కలిసినప్పుడల్లా ఒక కవితో, గేయమో, గజలో రాసి వినిపిస్తాడు.

నిత్యం తన జీవితంలో తారస పడుతున్న అనేక సంఘటనలకు, సమస్యలకు చలించి మనసులో ఏదో దిగులు పెట్టుకుని ఆర్ద్రంగా ఒక కవితను సృజిస్తాడు.

అతను రచించిన కవితా సంపుటి "పిచ్చోడు" కవితా ప్రియులను ఎంతో ఆకట్టుకుంటుంది. మనిషిని దేవుడిగా మార్చాలి ఈ సమాజం! కాని మనిషిని పిచ్చివాడిగా మలుస్తున్న ఈ సమాజం మీద ఎన్నో ఘాటైన కవితా గుళికలు ఈ కవితాలయంలో ఉన్నాయి. మచ్చుకి కొన్ని –

"వాడికి లౌక్యం తెలీదు అందుకే చెప్పిన ప్రతి పనీ చేసేస్తాడు..."

"దేవుడి మనసు మారింది... అందుకే అవతారాలు ఎత్తడం మానేసాడు..."

"నిషా సమయాలే తప్ప విషాద ఘుంటికలు వినిపించవు..."

"జరిగిన ఘోరం అలలా అలా అలా కలిసిపోయే సాగర సంగమం..."

"అమాయకుల అవయవ విస్ఫోటనం అంతరించిపోతున్న
మహోన్నత మానవత్వం..."

ఇలా కొన్ని అరుదైన భావ వ్యక్తీకరణలు ఈ గ్రంథంలో కనిపిస్తాయి.

"మనసు, జీవన చిత్రం, జీవన యానం శీర్షిక పైన కొన్ని గజళ్ళు కూడా రాసాడు. ఈ గ్రంథంలో ఒక చోట...

"ఉద్యమానికి ఓ నీతి విలువ... ఒకప్పుడు... ఎవరి స్వార్థం వారిదే ఇప్పుడు..."

మరోచోట "ప్రజాస్వామ్యం పరిణితి చెందింది – ప్రజల మనోభావం పరిపక్వత

దిల్చింది... మర్డర్లు, మానభంగాలు మామూలైపోయాయి" అని వ్యంగ్యంగా ఒక అస్త్రం వేస్తాడు సమాజం పైన.

ఉగాదికి నివేదన, ఓ పసిమొగ్గా క్షమించు, తెరచాటు బంధాలు, మగువా నీకు ఇవే నమస్సులు... ఇలా అన్ని కవితలలో ఎన్నో అమూల్యమైన కవితా రత్నాలను మనకు అందించాడు.

ముఖ్యంగా చెప్పాలంటే ఈ గ్రంథం ద్వారా, మనశ్రీలో ఉన్న ఆవేదనని ఆవిష్కరించే ప్రయత్నం చేసాడు. అందులో సఫలీకృతుడయ్యాడు. ఇంత మంచి పుస్తకానికి నా మనసులోని మాటలను రాసే అవకాశం ఇచ్చినందుకు మనశ్రీకి కృతజ్ఞతలు.

మనశ్రీ తలచుకుంటే ఏ ప్రక్రియనైన స్పృశించగలడు. ఇటీవల టీవీ సీరియల్స్‌కి, చలన చిత్రాలకు గీతాలు కూడా రాసాడు.

అతనో మంచి వ్యక్తి, భావుకుడు, స్నేహ సంధాన కర్త, మంచి కార్యక్రమ నిర్వాహకుడు, సమాజానికి దిక్సూచి, నటుడు.

ఇలా పలు రంగాలలో అభినివేశం కలిగిన పరిపూర్ణ వ్యక్తిత్వం మా మనశ్రీది.

గోదావరి పరివాహక ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు, నా ప్రక్కన మనశ్రీ లేకపోతే తల్లి గోదావరి కూడా 'ఏడయ్యా మనశ్రీ?' అని నన్ను అడుగుతుంది. అంతగా మమేకమైపోయిన స్నేహం మాది!

ఒక్కోసారి నాతో తిట్లు తింటాడు. తిట్లు తిని చివరలో అంటాడు "అన్నగారికి నా మీద ఎంత ప్రేమ ఉందో నాకు అర్థమైంది... అందుకే నాకు ఎన్నో జాగ్రత్తలు చెబుతారు" అని మురిసిపోతాడు. కొవ్వూరు వెళ్ళినప్పుడల్లా తన ఇంట్లో ముద్ద తిని వెళ్ళకపోతే పసిపిల్లాడిలా మారాం చేస్తాడు. నా మాటల వల్ల అందరికీ అర్థమై వుంటుంది అతను నాకు ఎంత ఆత్మీయుడో. అతను పలుకరిస్తే ప్రాణతంత్రులు మీటినట్లు ఉంటుంది. ఆత్మీయపు అంచులను చుంబించినట్లు అవుతుంది.

ఓ మంచి వ్యక్తిత్వం కవిత్వం రాస్తే అది రాబోయే తరాల వారికి దారి చూపే దివ్వె లాగ, అభిమానం చాటే బావుటా లాగా ఉంటుంది. అటువంటి ప్రయత్నమే మనశ్రీ అందించిన ఈ "పిచ్చోడు" కవితా సంకలనం.

మనశ్రీకి నా శుభాకాంక్షలు.



# తమ్ముడికో లేఖ

**వేదగిరి రాంబాబు**
ప్రముఖ రచయిత

అక్షరం మనుషుల్ని కలుపుతుంది. అందుకు నిదర్శనం మనిద్దరి
పరిచయం. కథానికా శతజయంతి సందర్భంగా
అన్ని జిల్లాలలోనూ సదస్సుల్ని నిర్వహిస్తూ,
ఏలూరు వచ్చినపుడు అనుకోకుండా దగ్గరయ్యావ్...
సన్నగా, ఎర్రగా కనిపించిన నిన్ను ఎవరు పరిచయం చేసారో
గుర్తులేదు గాని, ఇంత చిన్న వయసులో నీ అనారోగ్యం నన్ను
బాధించిందన్నది నిజం. అందుకు నాకు తోచిన
సహకారన్నందించాను. అప్పటి నుంచి నిన్ను గమనిస్తూనే ఉన్నాను.
ఒక తమ్ముడిలా నాతోనే ఉన్నావ్... నేను నిర్వహించే ఎన్నో సాహిత్య
కార్యక్రమాలకు నీ వంతు సహకారాన్ని అందిస్తూ వస్తూనే ఉన్నావ్.
మిత్రత్వంలో ఉన్న నీ నిజాయితీ నాకు తెలుసు. అదే నీకు ఎంతో
మందితో సాన్నిహిత్యాన్ని పెంచింది. అదే నీకు తరగని ఆస్థి.
నీలో ఆవేశం పాలెక్కువ. బహుశా అదే నిన్ను కవిగా మలిచిందేమో!
అక్షరంలో అణుశక్తి దాగుంది. అందుకే కవిగా నిన్ను కోరేదేమిటంటే
చెడుని చీల్చి చెండాడు. అదే విధంగా మంచికి హారతి పట్టు...
నీ పెన్ను నవసమాజ నిర్మాణానికి శ్రీరామరక్షవుతుంది. అవ్వాలి.
నీ కవిత్వం ఎందరికో మేలుకొలుపు కావాలని, నీ కలం నుంచి
మనుషుల్ని మానవత్వం వైపు మళ్లించే కవిత్వం ఇంకా ఇంకా
రావాలని కోరుకుంటూ, శుభాకాంక్షలు తెలియజేస్తూ శలవ్ –

నీ





## మనాశ్రీ గారి
# 'పిచ్చోడు' మనం కావాలి...!

మనాశ్రీ చెయ్యి తిరిగింది!
భావజాలాన్ని కవితలా మార్చే 'కసి' పెరిగింది!
'నిర్మోహమాటం' డోసేజి... పెరిగింది – ఆనాటి 'నాలో...'కే – నేటికీ!!
'రాయగా... రాయగా బాగా రాయడం'... లా
'చూడగా... చూడగా... బాధ వేడెక్కింది –
అవినీతిని చట్టబద్ధం చేస్తారని, లంచాలు అంటని వాళ్ళని ఉరి తీస్తారని...
ఆందోళన పెరిగింది –
పాడులోకంలో... 'లౌక్యం' తెలియని 'నగ్నసత్య'వాది 'వేమన'ని అన్నట్టే...
'పిచ్చోడు' అంటారని, తాను చూస్తున్న సత్యాన్ని స్వచ్ఛంగా చూపించి
పాఠకులకు వేడి పట్టించే ప్రయత్నం చేసారు మనాశ్రీ!
ఆ ప్రయత్నంలో ఓ మంచోడిని సృష్టించారు. వాడికి కన్నెర్ర చేయించి
కన్నీరు వేడివేడిగా మరిగించారు –
వాడి వేదనకి, వెర్రికీ స్పందించి...
వాడే జన్మలో బాగుపడడని దీవించారు –
వాడికి లోకం ఇచ్చే బిరుదునే ఈ పుస్తకానికి 'శీర్షిక'గా వాడుకున్నారు.
ఇందులో మనకర్థం కానన్ని తిట్లున్నాయి!
అవి రాళ్ళలా మారి మనకే తగుల్తోన్నట్లున్నాయి!!
(తూనా బొడ్లు... మనకి మనమే కాస్త లంచం ఇచ్చుకుని ఎస్కేపు అయిపోగల
బతకనేర్చినవాళ్ళం.)
సిగ్గు అనే పదం కనిపించని జీవన'గోదా'లో అభాగ్యుల కళ్ళముందుకి
ఆశాకిరణం వెతికారు –
మెత్తని గుండె కోటల ముందు, విషాద ఘంటికలు మోగించారు –
కొన్ని వేదనలకు ఫొటోలు తీసారు –

కొంతమందికి మనిషన్న విషయం గుర్తుచేసారు.
ఆవేశంతో నిందించారు... ఆవేదనతో మేలుకొల్పారు –
అనుబంధాల జాడలేని బంధాల గురించి అయోమయంతో ఆక్రోశించారు.
తెరచాటు విశృంఖలాలపై పెన్ను గురిపెట్టారు –
నాణానికి రెండోవైపు చూసి నమస్కార బాణాలు సంధించారు –
అంతా కవి వ్యంగ్య విమర్శనాత్మక వీక్షణం చేస్తూనే సమాజం కోసం
పరితపించారు –
ఒక మంచి మనసుని 'పిచ్చోడ'ంటున్న సమాజానికి నవరసాల
ట్రీట్‌మెంట్ సాగించారు –
చూడగా చూడగా బాధ వేడెక్కి నిర్మొహమాటం జోసేజితో
భావజాలాన్ని కవితలుగా అందించారు –
అందుకే... 'మనశ్రీ'కి మళ్ళీ నమః!!

ప్రముఖ రచయిత, చిత్రకారుడు



## బాల్యం నుంచే...

మూడవ తరగతి నా దగ్గర చదివిన నా విద్యార్థి వాసు (అదేనండీ ప్రస్తుతం మీ అందరికీ తెలిసిన మనశ్రీ) గురించి కొన్ని మాటలు మీతో చెప్పాలని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

బాల్యంలోనే 'శ్రీ'లోని కొన్ని సుగుణాలను నేను గమనించాను. అమాయకంగా కనిపిస్తాడు. చక్కగా అందరితో కలిసిపోతాడు. ఇతరులకు సహాయపడే మంచి మనసున్నవాడు. పెద్దల యెడల భయభక్తులు గలవాడు. దేనికీ భయపడడు. చురుకైనవాడు.

నా విద్యార్థి 'మనశ్రీ' ఒక మంచి రచయితగా ఎదిగినందుకు సంతోషిస్తూ భవిష్యత్తులో అతని కలం నుండి ఇంకా మంచి రచనలు రావాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ దేవుడు అతనిని, అతని కుటుంబాన్ని సకల ఐశ్వర్యాలతో నింపాలని దీవిస్తూ –

వేగేశ్వరపురం, ప॥గో॥ జిల్లా.

విశ్రాంత ఉపాధ్యాయిని



# మనాశ్రీ
# కవితా వ్యక్తిత్వం

మనాశ్రీకి కవిత్వం ఒక గమ్యం కాదు.
అది ఎప్పుడూ ఒక మజిలీయే.
ఆధునిక కవిత్వానికి నాలుగు
శిల్పపురుషార్థాలున్నాయి.
అవి అలంకారం, భావాభివ్యక్తి, చిత్రపరికల్పనం,
ప్రతీకా చిత్రణం. వీటిని క్రమం తప్పకుండా
పాటిస్తూనే, జీవితం అంటే నలుపు, తెలుపే
కాదు... ఇతరేతర రంగుల భేదాలు ఉన్నాయని,
వాటిని చిత్రిస్తూ, సమాజంలోని క్రూర
వాస్తవికతపై, ఆయన వ్రాసిన కవితలన్నీ సజీవ
వ్యాఖ్యానాలే.
అవి ఎప్పుడూ చిరంజీవులే.
సమాజానికున్న గ్లామరు, సమాజం లోపలి
గ్రామరు తెలిసిన కవితా వ్యాకరణవేత్త మనాశ్రీ.

అక్షరాభినందనలతో...

**(వల్లూరి రాఘవరావు)**
సీనియర్ కాపీ ఎడిటర్,
ఎ.బి.ఎన్. ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు



శ్రీ కామేశ్వరీ అమ్మవారి
దివ్య ఆశీస్సులతో...

# ఆత్మసాక్షికి - సమాజానికీ మధ్య
# నా అక్షరం

సంఘ సంస్కర్తలు, మహనీయులు, చరిత్రకారులు గడిచిన చరిత్ర. ప్రస్తుతం నడుస్తున్నది అంతుచిక్కని చరిత్ర. 'ఈ చరిత్ర ఏ సిరాతో' అని ఓ మహా దర్శకుడు, రచయిత అన్నారు. శ్రీశ్రీ గారు 'దొంగలంజాకొడుకులు మసలే ఈ ధూర్తలోకంలో నిలబడలేక వెళ్లిపోయావా నేస్తం' అని తన మిత్రుని గురించి ఆక్రోసించి మహాప్రస్థానం పొందారు. కొన్ని దశాబ్దాల క్రితం మహారచయితలు ఏమైతే చెప్పారో అంతకన్నా హీనస్థితిలో ప్రస్తుత సమాజం నడుస్తోంది. పురాణాలలో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమ కలిగించే మయసభ గురించి విన్నాం. ఇపుడు అంతా మాయే. విన్నవన్నీ నిజాలు కావు. కనపడేవన్నీ వాస్తవాలు కావు. ప్రతి రూపానికీ ఓ వికృత కోణం. గుర్తించేసరికి జీవితం నాశనం. నైతిక విలువల గురించి ఆలోచించక్కర్లేదు. వాతావరణాన్ని కాలుష్యం చేస్తోందని ప్లాస్టిక్‌ని ప్రకృతి నుంచైతే నిరోధించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్లాస్టిక్ మనసులను ఆపలేకపోతున్నారు. నరనరాన ప్లాస్టిక్ అంటే నా భావన కృత్రిమత్వం చోటుచేసుకుంది. చెప్పే మాటకు, చేసే పనికీ పొంతన ఉండదు. ప్రతి ఒక్కరూ సమాజం నాశనమైపోతోందని, విలువలు ఉండట్లేదని, అవినీతి పెరుగుతోందని, విచ్చలవిడితనం ఎక్కువైందనీ స్టేట్‌మెంట్లు ఇస్తారు. కాని వారిలోనే ఆ లోపాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని వేలెత్తి చూపే ధైర్యం ఎవరికీ ఉండదు - బతుకు ముందుకు సాగనివ్వరని. అన్యాయం, అహంకారం, అసాంఘికశక్తుల అరాచకం, తలదించుకునేలా అబలలపై అకృత్యాలు, ఆచరణ లేని సిద్ధాంతాలు... ఇదీ ప్రస్తుత సమాజ స్థితి. మంచి చెయ్యాలన్న తపన ఉన్నా, చెడుని ఎదిరించినా, తప్పు చేసే ప్రముఖులను నిలదీసినా, అవినీతిపై పోరాటం చేసినా ఈ సమాజంలో వాడు 'పిచ్చోడు'.

ఒక ఐ.పి.ఎస్. అధికారి ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై బాహాటంగా విమర్శిస్తే వెంటనే ఆ అధికారికి మతిభ్రమించిందని హడావుడిగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి

పంపితే 'నేను అనలే'దని ఆత్మవంచన చేసుకుని, బ్రతుకుజీవుడా అని బయటపడవలసి వచ్చింది. ఆ ఒక్క అధికారే కాదు ఎంతోమంది ఎన్నో కారణాలపై పిచ్చోళ్లుగా ముద్రించబడ్డారు. అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చింది కదా అని అర్ధరాత్రి తిరగమన్నారండీ అన్నందుకు క్షమాపణలు చెప్పవలసి వచ్చింది మనదేశంలో. 'రేప్' చేస్తే ఉరి తియ్యాలా అంటూ కనీసం స్పృహలో ఉన్నామో లేమో తెలియక మాట్లాడే నీచులు ఉన్నారు. ఇదంతా సమాజంపై కసితోనో, ఆక్రోశంతోనో, విమర్శించాలనో వ్రాయడంలేదు. ఇది వాస్తవం. నిజాలు జీర్ణించుకోవడం చాలా కష్టం. ఈ రోజు ఎన్నో ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజాచైతన్యం కలిగిస్తున్న శుభపరిణామంతో పాటు కొందరు పెడదోవ పట్టించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఒక అన్యాయం జరిగితే దానిని పదేపదే చూపిస్తూ చర్చావేదికలు పెడుతున్నారు. ఆ వేదికలో పాల్గొన్నవారికి ఎంత చిత్తశుద్ధి ఉంది, ఎంత అర్హత ఉంది అని ఆలోచించడంలేదు. ఎక్కడైనా అశ్లీలం జరిగితే ఇలా జరిగింది అని ఉదయం నుంచి సాయంత్రం వరకూ అవే దృశ్యాలు చూపిస్తుంటే సమాజాన్ని ఏ దిశలో నడిపిస్తున్నారో ఆలోచించుకోవలసిన పరిస్థితి. నేరం చేస్తే కొందరికి ముసుగు మరికొందరితో ఎందుకు చేసావు, ఎలా చేసావు అని విశ్లేషణ. రాత్రయితే చాలు చాలా ఛానల్స్ నేరం ఎలా జరిగిందో కళ్లకు కట్టినట్లు వేరే ఆర్టిస్టుల ద్వారా స్టోరీ, పిల్లల్ని తీర్చిదిద్దవలసిన బాధ్యత మానేసి, రెచ్చగొట్టే మాస్ కార్యక్రమాలు. బంధాలంటే భయమేసే సీరియల్స్. అవినీతిని అంతం చెయ్యాలని చైతన్యం చేస్తున్న ప్రచార మాధ్యమాల మూలాలకు వెడితే అసలు ప్రక్షాళన ఎక్కడ మొదలుపెట్టాలో భయమేసే పరిస్థితి. దానికి ఆ పెద్దలే పరిష్కారం చూపాలి. ఈ రోజు మీడియా ఇంత వేగం లేకపోతే సమాజం ఇంత ప్రగతి సాధించేది కాదు. దురదృష్టవశాత్తు అదే సమాజ నాశనానికి బీజాలు వేస్తోంది. ఇది సమాజం కోసం ఆలోచించే ప్రతి పిచ్చోడి ఆవేదన.

సమాజాన్ని సంస్కరిస్తానన్న సంఘ సంస్కర్త కుసంస్కారం, భక్తులను మాయచేసి అశ్లీలంగా ప్రవర్తించే స్వామీజీలు, తాగడం తప్పని చెబుతూ తాగుతూ పాటలురాసే గొప్ప రచయితలు... మనది ప్రజాస్వామ్యం కదా. పొగతాగడం – మద్యపానం హానికరం, నేరం అని ఒక స్లోగన్ వేసి యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తారు. వాటిని అరికట్టరు. అవి లేకపోతే బతకలేరు. ఎందుకంటే ఆదాయమార్గాలన్నీ అవే. సమాజంలో కూటికి లేనివాళ్లు, ఇంకా కుప్పతొట్లలో ఎంగిలి విస్తరాకులు తినే దీనులు ఉన్నారు. వారి గురించి ఆలోచించే పరిస్థితి మాత్రం లేదు. నిత్యం జరిగే అకృత్యాలు, పైశాచికత్వాలు చూస్తుంటే ఇటువంటి సమాజంలోనా మనం బతికేది అన్న ఏహ్యాభావం కలుగుతుంది. లౌక్యం తెలియకపోతే, ఎక్కడి తాళం అక్కడ వెయ్యకపోతే ఈ సమాజంలో

బతకడం కష్టం. చెప్పేది చెయ్యరు. చేసేది చెప్పరు. నిజాన్ని భరించరు. నమ్మకద్రోహం అలవాటుగా మారిందిప్పుడు. మరిచిపోయాం సిగ్గు అనే ఆభరణం.

వీడు పుస్తకానికి ముందుమాట వ్రాసుకోక, సంస్కర్తలా సమాజం కోసం రాస్తున్నాడు అన్న భావన కలగొచ్చు. సమాజంలో జరుగుతున్న లోపాలను వేలెత్తి చూపడం నా ఉద్దేశ్యం కాదు. యథార్థాలను "నాలో" పుస్తక రూపంలో ఆవిష్కరిస్తే ఎంతోమంది మెచ్చుకుని అవినీతిపై చాలా బాగా వ్రాసావు అంటూ నేను తృణమో పణమో ఇస్తేనే గాని పనిచెయ్యని మహానుభావులున్నారు. నా వరకు నేను ఖచ్చితంగా ఉండగలనేమో కాని రాత్రికి రాత్రి సమాజాన్ని మార్చే శక్తి నాకు లేదు. ప్రతి ఒక్కరూ తెలిసో తెలియకో తప్పు చేస్తారు. దానిని సరిదిద్దుకోవడానికి భగవంతుడు ఓ అవకాశం ఇస్తాడు. తెల్లారి లేస్తే అవినీతి పెరిగిపోతోందని స్టేట్‌మెంట్లు. ఇంత నల్లధనాన్ని, అక్రమ రవాణాల్ని, దొంగనోట్లని, కబ్జాదారుల్ని, లంచగొండుల్నీ ఎందుకు ఆపలేకపోతున్నారు. శిక్షను మనమే వేసుకుని, దానికి మార్గం మనమే చూపెట్టుకుని సురక్షితంగా బయటపడేలా చేస్తున్నాం. ఒక వ్యక్తి ఫించను లేక చావుబతుకుల్లో ఉంటే ఫలానా భారతీయుడు సినిమాలో, బ్రోకరు సినిమాలో, ఠాగూర్ సినిమాలో ఇలా కొన్ని సినిమా పేర్లు చెప్పి లంచగొండుల గురించి ఎలా చూపెట్టారయ్యా అంటూ వెకిలి నవ్వు నవ్వుతూ డ్రాయర్ సొరుగులో 'బరువు' పెట్టాక పనిచేసిన ఘనులు. అవినీతిపరుడుగా బాగా ముద్రపడ్డ ఓ అధికారి పదవీ విరమణ సభలో 'సమాజంలో అవినీతి పెరిగిపోతోందని మాలాంటి రచయితలు స్పందించి మంచి పుస్తకాలు వ్రాయాలని' సలహా ఇస్తుంటే ఆయన్ని ఎదురుగా తిట్టాలని ఉన్నా, సమాజంలో బతకడం కోసం మౌనంగా ఉండాల్సి వచ్చింది. ఇదీ తప్పే. తప్పును ఖండించే శక్తి ఉండీ మాట్లాడకపోతే మానసిక వ్యభిచారం చేసినట్లే. ఇది ఒక వ్యక్తి గురించి వ్రాసింది కాదు. ఇలా వ్రాయాలంటే ఎన్నో అంశాలున్నాయి. ఇవన్నీ వాస్తవాలు. సమాజం భరించలేని నిజాలు. స్త్రీలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఖండిస్తున్నారు. అనాదిగా స్త్రీకి అన్యాయం జరుగుతూనే ఉంది. వారిపై అఘాయిత్యానికి పాల్పడే మగాడు మృగాడుగా పిలవబడడం సమంజసమే. అయినా, ఈ దుస్థితికి కారణం ఒక మగవాడే కాదు. స్త్రీలు కూడా. అభం శుభం తెలియని పసిమొగ్గలను సైతం వ్యభిచార కూపంలో దింపేదెవరు? ఇవన్నీ నిలదీస్తే భరించగలరా! వాస్తవం వేరు. కవిత్వం వేరు. వాస్తవాన్ని కవిత్వంలో చెప్పకూడదు అంటారు ప్రముఖ రచయిత, చిత్రకారుడు 'బ్నిం'. నిజం చెబితే ఊరుకోరుగా 'పిచ్చోడు' అంటారు. కానివ్వండి. జీర్ణించుకోలేని వాస్తవాలే ఈ 'పిచ్చోడు' కవితా సంపుటి. దీని ముఖచిత్రం 'బ్నిం' చేత గీయించి ప్రఖ్యాత రచయిత, నటుడు శ్రీ తనికెళ్ల భరణి గారికి చూపెడితే 'ఈ టైటిల్ ఎవరు పెట్టారయ్యా' అని

అడిగారు. తిడతారేమోనని భయం వేసినా, 'నేనే పెట్టాను సార్' అన్నా. 'నువ్వు చెప్పదల్చుకున్న భావానికి బాగా పెట్టావయ్యా' అని మెచ్చుకున్నారు. కాని అటువంటి మహానుభావుడు ఈ పుస్తకానికి ముందుమాట వ్రాస్తారని కలలో కూడా అనుకోలేదు. నేను కాస్త భయం భయంగా అడిగితే 'లౌక్యం ఎందుకు ముందుమాట నేను వ్రాస్తా' అని మాటిచ్చారు. ఇది నిజంగా నా అదృష్టం. ఈ పుస్తకానికి అన్నీ తానై ఒక రూపు రావడానికి కారణం శ్రీ బ్నిం గారు. ఏ విధంగా ఆయన ఋణం తీర్చుకోగలను. నన్ను అడుగడుగునా ప్రోత్సహించే నా అన్నయ్య 'పిచ్చోడు' టైటిలా అని వారిస్తున్నా ఆయన్ని బతిమాలి ఒప్పించి శ్రీకారం చుట్టాను. ప్రేమతో మాట వ్రాసారు. ఆయనే మాస్ట్రో కళారత్న డాక్టర్ గజల్ శ్రీనివాస్‌గారు. ఆయన నా ఊపిరి.

ఈ రోజు రచయితగా ప్రోత్సాహంతో పాటు నేను బతికి ఉన్నానంటే కారణం ప్రముఖ కథానికా రచయిత డా॥ వేదగిరి రాంబాబు గారు. వైద్య సహాయమే కాదు, ఆర్థికంగా, హార్ధికంగా ఆదుకుని గుండె వైద్య నిపుణులు డా॥ పి.ఎల్.ఎన్. కపర్ధి గారికి చూపెట్టడం, ఆయన కూడా నన్ను స్వంత తమ్ముడిలా భావించి వైద్యం చేస్తూ ఆర్థికంగా పడిపోకుండా అన్నీ తానై మానసికంగా ధైర్యాన్ని ఇస్తుండడం... ఏ జన్మ బంధమో. నాకు జన్మనిచ్చి నా ఉన్నతికి కారణమైన నా తల్లిదండ్రులు శ్రీమతి అన్నపూర్ణ, శ్రీ గణపతిశాస్త్రి గార్ల ఋణం తీరనిది. నాకు దేవుడిచ్చిన వరం నా మామయ్య ఈవని కాశీవిశ్వేశ్వరరావు. నా గురువుగారు డా॥ రాయప్రోలు కామేశ్వరశర్మ గారు. నా అడుగులో అడుగైన శ్రీ కూచి గౌరీశంకరరావుగారు, శ్రీ పసుపులేటి నరసింహారావు, శ్రీ బి.వి.యస్.యన్. ప్రసాద్... ఇలా ఎంతోమంది నా జీవితంలో.

కవితలకు ఆదరణ లేక, సాహిత్యానికి ప్రోత్సాహం కరువవుతున్న ఈ రోజుల్లో ఈ పుస్తకాన్ని తీసుకురావాలని నా అన్న పిల్లలమర్రి మురళీకృష్ణ (పండు) తపిస్తే, మేమున్నాం అండగా అంటూ ఈ పుస్తక ఆర్థిక, హార్ధిక భారాన్ని మోసారు నా మిత్రులు శ్రీ దశిక శ్రీనివాస్, డా॥ మాధవ్, శ్రీ కోట్ల వీరరాఘవులు. ఓపికగా సహకరించారు మా కుటుంబ హితైషి శ్రీ ఏలూరి గోపాలకృష్ణగారు. వెన్నెల్లో హాయ్ హాయ్, మల్లెల్లో హాయ్ హాయ్... ఈ పదాలు ఆ మంచి మనస్తత్వానికి సజీవ సాక్ష్యాలు. భేషజం లేని, కల్మషం లేని పలకరింపుతో ఒక పెద్ద నిర్మాతైనా అడిగిన వెంటనే వ్యవధి లేకపోయినా పుస్తకాన్ని ఆసాంతం చదివి రచయితకు విలువనిచ్చి అభివృద్ధిని ఆకాంక్షించి కొసమెరుపుగా ఆఖరుమాటగా ఆయన హృదయాన్ని ఆవిష్కరించిన మహర్షి సినిమా ప్రొడ్యూసర్ ఎ.పి. ఫిలిం ఛాంబర్స్ ప్రొడ్యూసర్స్ సెక్టార్ వైస్ ఛైర్మన్ శ్రీ వల్లూరిపల్లి రమేష్ గార్కి కృతజ్ఞతలు చెప్పడానికి అక్షరాలు చాలవు. ఈ పుస్తకం యొక్క ధరాభారాన్ని, దూరాభారాన్ని నియంత్రించి తమ స్వంత పుస్తకమే ప్రచురించినట్లు మంచి సలహాలను,

సూచనలను ఇచ్చిన కథాకేళి మాసపత్రిక ప్రచురణకర్త ముత్యాల రామారావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా బాల్యాన్ని స్పృశించి, నా ఎదుగుదలను ఆశిస్తూ ఈ వయసులో నన్ను గుర్తుపెట్టుకొని మాటలు వ్రాసిన నా మూడో తరగతి టీచర్ శ్రీమతి రూతమ్మ గార్కి, ప్రూఫ్ రీడింగ్‌లో సహకరించిన శ్రీ పొన్నా కృష్ణబాబు, మనాశ్రీ కవితలను అందంగా కనిపించేలా వ్రాసిన శ్రీ చెరుకూరి శ్రీనివాస్ గార్కి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. శ్రీ కె. శ్రీనివాస్ – *NTV*, శ్రీ కోట్ల సత్తిబాబు, నేను ప్రస్తుతం పనిచేస్తున్న పశివేదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వేమూరి శ్రీనివాస రావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఇస్తున్న సహకారం ఎనలేనిది.

ఇందులోని ఒక్కొక్క కవిత ఒక అనుభవం కాదు – మనం అనుభవిస్తున్న నిజ జీవితం. ఇది విమర్శ కాదు – సామాన్యుడి ఆవేదన, అమాయకుడి రోదన, మేధావి మౌనం, ఓ నిస్సహాయుడి ఆక్రందన, ఓ మంచోడి తపన. కోరుకునేది ఒక్కటే – మార్పు. ఆ మార్పు ఎవరో చెబితే కాదు ఎవరికి వారే తేవాలి. తెచ్చుకోవాలి. అదే ఈ పిచ్చోడి ఆకాంక్ష. చదవండి, మనసారా దీవించండి. తప్పులుంటే క్షమించండి. పిచ్చోడని పక్కన పారేయకండి.

ఎల్లప్పుడూ మీ ఆదరణ కోరే...

**మనాశ్రీ**




శుభాకాంక్షలతో...

**జి. శ్రీధర్‌రాజు**

అధ్యక్షుడు:
ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్
అసోసియేషన్, పశ్చిమగోదావరి

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | జీవన గోదావరి | 19 |
| 2. | పిచ్చోడు | 21 |
| 3. | విషాదఘుంటికలు | 22 |
| 4. | వెయిటింగ్ ఫర్ యు | 24 |
| 5. | రుధిర వేదన | 25 |
| 6. | ఓ మనిషీ నువ్వు నువ్వే | 26 |
| 7. | మనసు | 28 |
| 8. | జీవనచిత్రం | 29 |
| 9. | జీవనయానం | 30 |
| 10. | ఊపిరాగిందా నేస్తం? | 31 |
| 11. | ఒరేయ్ బండోడా | 32 |
| 12. | అవినీతికి అభిషేకం | 33 |
| 13. | ఓ తీవ్రవాదమా! ఆపు నీ ఘోరకలి | 34 |
| 14. | ఉగాదికి నివేదన | 35 |
| 15. | ఓ పసిమొగ్గా క్షమించు... ఓ సోదరీ క్షమించు... | 37 |
| 16. | అనుబంధాలది ఏ దారి? | 38 |
| 17. | సమరం ఆపకు హజారే | 39 |
| 18. | తెరచాటు బంధాలు | 40 |
| 19. | ఇది ప్రజాస్వామ్యం బాసూ | 41 |
| 20. | ఉ"దయ"లేని కిరణాలు | 42 |
| 21. | మగువా నీకివే నమస్సులు | 43 |



దశిక నరసావధానులు

# శిరస్సు వంచి నమస్కరిస్తున్నా...



కవిత్వానికి ఆదరణ తగ్గుతున్న ఈ రోజుల్లో నన్ను ప్రోత్సహిస్తూ ఈ పుస్తక ముద్రణకు ఆర్థికంగా, హార్థికంగా సహాయం చేసిన పుణ్యమూర్తులు

కీర్తిశేషులు **దశిక నరసావధానులు,** రిటైర్డ్ ఎం.ఆర్.ఒ.,
స్మృతిచిహ్నంగా వారి సతీమణి **శ్రీమతి దశిక సూర్యకాంతం,**
వారి కుమారులు
**శ్రీ దశిక వెంకటశేషసుబ్బయ్య,**
బ్రాంచ్ మేనేజర్, ఎస్.బి.ఐ., హనుమాన్‌జంక్షన్
**శ్రీ దశిక శివసోమసుందరం,** రైల్వేస్, సికింద్రాబాద్
**శ్రీ దశిక శ్రీనివాస్,** డిప్యూటీ మేనేజర్, ఎస్.బి.ఐ., జంగారెడ్డిగూడెం
**శ్రీ దశిక సత్యనారాయణమూర్తి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐ.ఐ.టి., ముంబై
**డాక్టర్ టి. రాజేంద్రమాధవ్,** బి.డి.ఎస్., CC Endo, FAGE



దశిక శ్రీనివాస్

**డాక్టర్ ఉషాసుప్రియ,** బి.డి.ఎస్.
శ్రీ లక్ష్మీ రవిశంకర్ మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్, మసీదు వీధి, కొవ్వూరు. ఫోన్: 08813-233323



డా॥ రాజేంద్ర మాధవ్

ప్రముఖ వ్యాపారవేత్త **కోట్ల కృష్ణానందం** గారి సౌజన్యంతో
వారి కుమారులు **కోట్ల వీరరాఘవులు,**
మనుమడు **కోట్ల వంశీకృష్ణ**
శ్రీ వీరవెంకట సత్యనారాయణ మెడికల్ స్టోర్స్, మెయిన్‌రోడ్, కొవ్వూరు,
ప॥గో॥ జిల్లా, ఫోన్: 08813-231254

వీరందరికీ **కృతజ్ఞతలు.**



డా॥ ఉషాసుప్రియ



శ్రీ కోట్ల కృష్ణానందం



# మా ఆశ

ఆయనకి కవిత్వం మొదటి భార్య అని నా అనుమానం. కవులంతా ఆయనకు కుటుంబం - అని రూఢిగా తెలుసుకున్నాను. పాప చి॥ కామేశ్వరీ సాహితి మీద ఆపేక్ష వల్ల ఇంటికి వస్తున్నారు గాని, ఆయన కవుల సమక్షంలోనే కాలం గడిపేయడానికి ఇష్టపడతారు. మా పాప ఇంకా భూమ్మీదకు రాకుండానే తొలి కవితా సంకలనం “నాలో” కి కన్నతండ్రి అయ్యారు.

పాపంటే మాకు పంచప్రాణాలు. తను పెరిగి పెద్దయ్యే నాటికి ఈ సమాజంలో మార్పు వస్తే బావుంటుందని నా వంతు ప్రయత్నం చేస్తున్నాను అంటారు. నిజంగా భావితరానికి ఆయన కవిత్వం కూడా బాటలు వేస్తే నాకెంత ఆనందం. ఆయన కన్నా ఎక్కువ ఆనందిస్తానేమో.

**విజయా మనోశ్రీ**

# జీవన గోదావరి

మంచితనం మానవత్వం ఎంత మధురం
అభాగ్యుల కన్నీటి ధారకు ఓ ఆశాకిరణం
కనుమరుగవుతూ మిగులుస్తున్న చేదు గుళికల ఆశనిపాతం
బాంధవ్యం, భద్రత, కట్టుబాటు ఆ తరం
ఎవరి దారి వారిదే అన్న తీరు ఈ తరం
స్నేహానికి ప్రాణం, ఆత్మీయ సంబరం ఒకప్పుడు
నవ్వుతూ నలిపెయ్యడం, నమ్మకద్రోహం అలవాటుగా మారిందిప్పుడు
నైతిక విలువ, మాట పోషణ ఏనాడో
మరిచిపోయాం సిగ్గు అనే పదం ఈ రోజు
మన వీధిలో హత్య జరిగింది... మనకు నష్టం లేదుగా...
ఎవడికో కష్టం వచ్చింది... నాకు రాలేదుగా...
అవినీతి తాండవం చేస్తోంది
అందులో నేనూ ఒకడ్నే
పక్కింటివాడు ఎల్.సి.డి. కొన్నాడు
వెధవ బావుపడి చస్తున్నాడు
అయ్యా ఈ గిఫ్ట్ ఉంచండి మీ కోసమే
రండి... రండి... కూర్చోండి... బాగున్నారా
రాజకీయాలు నాశనమయ్యాయి
పోతేపోనీ మొన్న ఓటుకి వంద కూడా ఇవ్వలేదు
సమాజం మారాలిగా
నా ఒక్కడి వల్లా సాధ్యమా, అందుకే గుంపులో గోవిందా

నువ్వు తప్పు చేయకు అందరికీ ఆదర్శంగా వుంటావు
వాడు చెయ్యట్లేదూ...
నేను మడికట్టుక్కూర్చుంటే ఏం మిగులుతుంది గోచీ
నువ్వెందుకు ఏడుస్తున్నావ్? వాడికి పేరొస్తోందిగా...
ఆ పేరేదో నీదే కావచ్చుగా? నా వల్ల కాకేకదా ఈ బాధంతా...
మానవత్వం, మంచితనం, నైతికత, మాట విలువ ఏంటీ ఈ లొల్లి?
కనుమరుగవుతున్నాయని ఆక్రోశిస్తే పేరైనా వస్తుంది
ఎందుకీ పాట్లు? కలియుగంలో కపట నాటకాలు...
నాకెందుకులే నాదీ మీ దారే, ఏదా దారి?
ఏదో రోజు పతనమయ్యే జీవన గోదారి!

*(కళాగౌతమి మాసపత్రిక)*

# పిచ్చోడు

వాడికి లౌక్యం తెలియదు, చెప్పిన ప్రతి పనీ చేసేస్తాడు
దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టాలి, ఎందుకీ సామెత?
అవకాశం ఉండగానే నాలుగురాళ్లు వెనకేసుకోవాలి
జీతంరాళ్లు వస్తున్నాయిగా
గీతం అయితే నవనీతంగా ఉంటుంది
తప్పు నాయనా ఏదో రోజు దొరికిపోతావు
నష్టం లేదు నా వాటాలో వాడూ భాగస్వామే
న్యాయం ఊరుకోదు, నిజం తెలుస్తుంది...
అంత సీను లేదు. ఏంటో ఆ ధీమా?
నేను చెప్పే అబద్ధం నిజం, వాడు చెప్పే నిజం అబద్ధం
పైన దేవుడున్నాడు. చూస్తూ ఊరుకోడు...
అందుకేగా ఆయన వాటా ఇచ్చేస్తున్నా...
పాపం పెరుగుతుంది తగ్గదు
దేవుడి మనసూ మారింది
అందుకేగా అవతారాలు ఎత్తడం మానేసాడు?
నువ్వు నెగిటివ్‌గా ఆలోచిస్తున్నావ్ చాలా మారాలి
నయం నువ్వు మనిషే కాదు అనలేదు
అలా ఎందుకంటాం? పిచ్చోడని ముద్రేస్తాం...
అవునులే నగ్నసత్యాలు వ్రాసిన వేమనా పిచ్చోడే
ఆయన మహానుభావుడు
నీకు లోకం పోకడ తెలియదు
సైకిల్ బతుకు సాగిస్తున్నావ్
నాకు బెంజి కారుపై ఆశలేదు
గంజి నీళ్లైనా తాగి బతుకుతా
ఖర్మ... ఈ జన్మలో నువ్వు బాగుపడవ్

# విషాద ఘుంటికలు

ఓ గులాబీ సుమం, నీ రక్షణ కోసమేనంటూ
చెంతనే ఉంటూ... చెరపట్టే కంటకాల కుహకం
గులాబీ మనసును గుచ్చి హింసించాలనే విషతుమ్మెదల ఝుంకారం
ఆ పువ్వులా నవ్వే ఓ చెల్లీ... నీకూ అవే చెరలు
లొంగితే రాక్షస రతి... లేదంటే రసాయన దాడి
సాగుతున్న కీచకపర్వంలో వేగిపోతున్న నీ హృదయానికి
ఎందుకమ్మా... సానుభూతుల వర్షం?
విచ్చుకత్తుల విలయం పట్టని కబోది సమాజం నిన్ను జీవచ్ఛవాన్ని చేస్తే
చేతకానితనాన్ని చేయూత పేరుతో నీపై కాసులు వెదజల్లే ప్రభుత్వం
మెరుగైన సమాజం మా లక్ష్యం అంటూనే
నీపైనే కూలుతున్న 'నాలుగో స్తంభం'
వారికి పట్టదు నీ గోడు... నీ బాధను సంచలనం చేసి
తమ రేటింగ్‌లు, సర్క్యులేషన్‌లు పెంచుకునే కుచ్చితం తప్ప
మరి వీడ్ని చూడు... వీడు ప్రేమోన్మాదా?
నీవు కాదన్నావని ఆత్మాభిమానం దెబ్బతిని
రసాయన దాడికి తెగబడ్డానని నిర్లజ్జగా నిలబడి చెబుతూంటే
వాడి చుట్టూ కెమేరాలు పెట్టి,
మూతి ముందు మైకు పెట్టి
వాడి రాక్షసకృత్య కథాకమామిషును
సజీవంగా చూపేవాళ్లది ఏ ఉన్మాదం?
వాడిది ఉన్మాదమో,
అమ్మానాన్నల సంరక్షణ వైఫల్యమో...?
నిన్ను వికృతంగా మార్చే హక్కు వాడికి
నీ వేదనను వాళ్ళే శోధించినట్లు ఫోజిస్తూ
వ్యాపారం చేసుకునే హక్కు వాళ్ళకు ఎక్కడిదమ్మా!?!
ఒరేయ్ ఉన్మాదీ...
అమ్మ ఆకృతిని విచ్ఛిన్నం చేసే హక్కు నీకేది
అంగబలం అర్థబలం ఉంటే

ఈ కలకలం కాలంలో కలసిపోతుందని ధీమానా?
దురదృష్టం వెన్నుంటే, బలం లేకుంటే ఎన్‌కౌంటర్
ఆత్మాభిమానం అడ్డొస్తే యాసిడ్ ఏంటాసిడ్‌లా నువ్వే సేవించు
నీ తల్లిదండ్రులకు కనువిప్పు నీ ఉన్మాదానికి ముగింపు
ఆడుకోవడానికి, అరగకపోతే వేసుకోవడానికి
ఏంటాసిడ్ కాదు నాయనా! యాసిడ్!
కత్తి ఆడుకునే బొమ్మ కాదు చేతకాని అది ఆయుధమే
పాడులోకం నుండి విముక్తి పొందిన
స్వప్నిక, ఆయేషా, శ్రీలక్ష్మి... మన్నించండి
అమ్మా అనూషా! మనది వైవిధ్య ప్రజాస్వామ్యం
దేవుని నైవేద్యానికి తప్ప నిర్భాగ్యుల వేదనకు చోటేలేదు
అసమర్థతగా బాధాతప్త హృదయంతో అంజలి ఘటిస్తున్నా...
అంతా నిశ్శబ్దం. నిషా సమయాలే తప్ప
విషాద ఘంటికలు వినిపించవు
జరిగిన ఘోరం అలలలా అలా అలా కలిసిపోయే సాగర సంగమం.

# వెయిటింగ్ ఫర్ యు

తరాలు మారినా తీరు మారదు
యుగం ఏదైనా నువ్వు కోరే పలకరింపే
టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కినా
సైన్స్ వింత వింతలు సాధిస్తున్నా
అనాదిగా అనాగరికంగా అదే వెక్కిరింపు
సొంతాన్ని ఆనందించలేని నీ తత్వం
నీ కులుకుల పలకరింపుకు తొలకరిస్తూ
నా మార్పు ఎలా ఉన్నా మారని నీ నైజం
అంతా రెడీమేడ్ ఎక్కడికక్కడే...
బతుకుబండి అనుబంధాల ఒడి
నీ జీవన బడి చీకట్లు చిమ్మదా?
ఆబగా అద్దె నగవుకు ఎదురుచూస్తూ
ఏమిటా ఏమరుపాటు? ఉలిక్కిపడకు...
పలకరించేది నిన్నే, ఎదురు చూసేది నీకోసమే
కష్టం, నష్టం, మారని అడుగు నీ ఇష్టం
ఏమైతేనేం, ఎటుపోతేనేం వింతపోకడల సంస్కృతి
ఏయ్... నిన్నే... ఒక్కసారి పలకవూ?
నేనే అంగట్లో అమ్మడ్ని మిణుక్కుమన్నానా
ప్రతిక్షణం నీ కోసమే ... పార్కైనా, ఏ వసతైనా
ఆకర్షణంతా నీ కోసమే వెయిటింగ్ ఫర్ యూ
బట్ థింకింగ్ బెస్ట్ ఆఫ్ యువర్ లైఫ్...
ఇన్ ఎవ్విరి స్టెప్...

# రుధిర వేదన

మతోన్మాదం – తీవ్రవాదం – ఉన్మాదం
ఓ గుండె బాధ, ఓ నిర్జీవ దేహం నిస్సహాయత
అనాథగా మారిన పసిహృదయ వేదన
కడుపు కోతతో మాయని గాయం మిగిల్చిన ప్రశ్న
రుధిర ఘంటికలు, హుంకార ఝుంకారాలు
భీతావహదృశ్యం – విలయ నాట్యం చేసిన పశుత్వం
మనసులో కలత, చెదిరిన హృదయస్పందన
ప్రశాంత జీవనంలో పెనుతుఫాను – మారుతున్న నాగరికతకు సవాలు
కర్కశత్వపు హవా, కాఠిన్యపు జాడ
అర్థంకాని లక్ష్యం, జీవన గమ్యంలో అంతులేని నిర్వేదం
మతం మూర్ఖత్వపు చీడ – తీవ్రవాదం అసమర్థుని హింసాధ్వని
మతఛాందసత్వం వేళ్లూనిన ఉన్మాదం
పాలకుల నిర్లక్ష్యపు నీడ, గతించిన నైతిక విలువ
జనం ప్రవాహంలో ప్రజ్వరిల్లుతున్న స్వార్థం
ఊపిరి పోసుకుంటున్న ఉగ్రవాదానికి సజీవసాక్ష్యం
తీవ్రవాదం కాదిది – తీవ్రవేదనం
తీవ్రవాదపు పోరు – విదిల్చింది అమాయకులపై జూలు
శోకతప్తతతో నాదేం తప్పని రోదిస్తోంది
అమాయకుల అవయవ విస్ఫోటనం
అంతరిస్తున్న మహోన్నత మానవత్వం
మరిచిపోతున్నాం సిగ్గు అనే ఆభరణం
ఉప్పెన, తుఫాను, సునామీ... ప్రకృతి శాపం
దిగజారిన మనిషి నైజం పెరుగుతున్న విషవృక్షం
మృగంగా మారుతున్న ఓ మనిషీ
ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించు
పైశాచిక నటవిన్యాసంలో కోల్పోయేది నీ ఆత్మబంధువులని
అందుకే దేశప్రగతికై వేయి ఒట్టు – తీవ్రవాదాన్ని మట్టుబెట్టు

*(ఆంధ్రజ్యోతి దినపత్రిక – జనవరి, 2009)*

# ఓ మనిషీ నువ్వు నువ్వే

మనిషీ... ఓ మనసున్న మంచి మనిషీ!
నీ ఉద్యమంలో హృదయం, మనసంతా అమృతం
భావసారూప్యానికి, వాత్సల్యానికి, బాంధవ్యానికీ రధసారధివి
యుగాలు మారుతున్నా,
అంతరిక్షానికి బాట వేసినా... నీవు మనిషివే
ఏదో వ్యత్యాసం గతి తప్పుతున్న తీపి జ్ఞాపకాలు,
మనిషి మనిషికీ పెరుగుతున్న అంతరపు జాడలు
గుండెలోతుల్లో, హృదయాంతరాళంలో
ఎగిసిపడుతున్న విషజ్వాలల సెగలు
మనిషి మనిషినే భరించలేని దుర్గుణం,
సాయపడలేని, ఓర్వలేని నైజపు చారలు
సైన్స్ సాధించిన అభివృద్ధి, మారిన సంస్కృతిలో పెనువిస్ఫోటనం
తరం, తరం వేగమైనా,
నిరంతరం గజగజలాడిస్తున్న వికృత భావాల రూపురేఖలు
మానవీయ కోణంలో మార్పు,
దృక్పథపు ప్రగతిపథంలో దూరమవుతున్న అనుబంధాలు
కనుమరుగైన నైతికత, గతిస్తున్న మానవత్వం
అసలు నీ మనుగడే ప్రశ్నార్ధకం.
నువ్వు మనిషివేనా!?
మనసంతా మాలిన్యం, మనోగాయాలు చేస్తూ
అంతరిస్తోంది దయార్ద్రహృదయమా? నువ్వేనా?
భౌతికంగా ఉన్నా, నీ నట చాతుర్యంతో
మనిషి మనిషినే నమ్మలేని నిజం, భయం
వ్యర్ధంగా మారుతున్న జీవనం
శాసించేది భగవంతుడు... జగన్నాటకంలో నీ పాత్ర కొద్దిరోజులే
ఈ యథార్ధం ప్రబోధించే నువ్వే
నువ్వు నువ్వుగా లేనప్పుడు – నువ్వు నువ్వే కానప్పుడు
ఎందుకీ జన్మ

ఏ జీవనం పొందలేని మాధుర్యం – ఏ జీవీ వ్యక్తపరచలేని
భావజాలం నీ సొంతం
కూటికోసం పాటుపడే జీవనయాగాన్ని
సక్రమంగా అమలుపరచలేని గమ్యం
సృష్టిలో ఇమడలేని వ్యథార్త చరితం
నువ్వు మనిషివే!
మృగానికి, నీకూ భేదం నాణానికి అటూ ఇటూ
ఆలోచించు... మనసుపెట్టి ఆలోచించు...
మనిషివి గనుక మనిషిగా ఆలోచించు
రాకెట్‌యుగంలో సాంకేతిక విప్లవంతో అద్భుతాలు సాధిస్తున్న నువ్వు
యాంత్రికతత్వాన్ని మాని,
విద్వేషాలను, రక్తపాతాలను, మతకల్లోలాలను వదిలిపెట్టి,
స్వచ్ఛమైన ప్రేమను పంచు – మానవత్వమే మతమని చాటు
ఉగ్రవాదిని తయారుచేసినా, మట్టుబెట్టినా నీ మేధస్సే
నువ్వు మనిషివి. మృగానివి కావు...
నేను మనిషిని... మనసున్న మంచి మనిషిని...
నేను మనిషిని... నా ఉద్యమంలో హృదయం ఉంది
నేను మనిషిని... నా మనసులో అమృతం ఉందని నిరూపించు
నీ నిశ్వాస, ఉచ్ఛ్వాస కదలికలు ఆగేంతవరకు...

*(వెన్నెల్లో గజల్ కార్యక్రమంలో
ప్రశంసలు పొందిన కవిత)*

# మనసు

మనిషికి మనసన్నదే కరువయిపోయింది
బాధలతో ఈ బ్రతుకు బరువయిపోయింది

మారుతున్న జీవనం వేగంగా మారి
మధురమైన భావం కనుమరుగయిపోయింది

సాంకేతిక విప్లవం శహభాష్ అనిపించి
యాంత్రిక జీవన గమనం అలవాటయిపోయింది

హృదయంలో ఎగసిపడే విషజ్వాలల సెగలు
ఓర్వలేని నైజం దుర్గుణమయిపోయింది

నువ్వు నువ్వుగా నువ్వే కానప్పుడు
మనిషిగా నీ జన్మ వ్యర్థమయిపోయింది

ఒదుగైన మనసుతో కలకాలం సాగిపో
మేలుకోరు మనాశ్రీ నీ మనసు సుఖమయిపోయింది

# జీవనచిత్రం

గరళాన్ని గొంతుకలో దాచాడు శివుడు
సత్యాన్ని మింగుతాడు నవజీవన నరుడు

సుకుమారి స్వప్నం విరబూసే మధురం
తేనెలో హాలాహలం రుచిచూపించే వానరుడు

స్వాతి ముత్యపు పదనిసల స్వరాలు పలికే
లోగుట్టుకు సొగసులద్దే అసురుల వారసుడు

మూడుముళ్ళ బంధంతో ఏడడుగులు వేసి
వ్యసనాల ఉరితాడే నేటి తరపు మానవుడు

మనసున్న వ్యక్తిగా మసలే ప్రతి మనిషీ
తనదన్న రోజున విచక్షణ మరచే కాలాంతకుడు

జీవనచిత్రం కల్మషాల గమ్యమే మనాశ్రీ
కళ్లుగప్పే హరుల చిట్టా సరిచేస్తాడు యముడు

# జీవనయానం

చీకటి పడుతున్నది చిరుదీపం వెలిగించనీ
బతుకు చివుకుతున్నది కన్నీటిని తొలగించనీ

మసకేసిన ముసిమి మార్గాన్ని చూపుతుంటే
మిణుకుమనే ఆశతో ఆత్మను ఓదార్చనీ

గూడులేని జీవితం ఆత్మీయత పెనవేస్తే
ఆవిరయ్యే కోర్కెలను కడదాకా కడతేర్చనీ

కల చెదిరిన గతం స్మరణ
అలసిన హృదయం అక్కున సేదతీరనీ

పూలబాటలా సాగదు ప్రతీ పయనం
కంచిత్రపు ముల్లు దిగిన చోటే మూలాలు పెకలించనీ

ఆటుపోట్ల జీవనయానం ఆగని పోరాటం!
అలుపన్న దరికి రాకు మనాశ్రీ నీ ఆరాటం సాగనీ

# ఊపిరి ఆగిందా నేస్తం

నమ్మకద్రోహం... నవ్వుతూ తిరుగుతూ
ఆత్మీయతకు విలువ నశించి
బంధాలు బంధనంగా మారి
విశ్వాసం విఘాతం కలిగిస్తుంటే
ఎంతోమంది రోగుల జీవనజ్యోతిని వెలిగించి
ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుని
నమ్మినవారి నమ్మకంలో నలిగి
మంచి చెడుల మానవతా వాదంలో
మూర్ఖుల మధ్యన బతుకెందుకని
అన్యాయపు దుర్గంధాన్ని భరించలేక
మీ ఊపిరి ఆగిందా నేస్తం?
ఇది దారుణం నేస్తం...
మీరు మాత్రం చూడలేని ఈ పాడులోకాన్ని
నిత్యం చస్తూ బతకమని వదిలేసారా?
మానవత్వానికి అర్థం చెప్పి -
మానవతా విలువలు నశించిన ఈ సమాజంలో
మీ జ్ఞాపకాలతో బతకమని వెళ్లిపోయారా నేస్తం?

# ఒరేయ్ బండోడా

ఉద్యమానికి ఓ నీతి, విలువ ఒకప్పుడు
ఎవరి స్వార్థం వారిదే ఇప్పుడు
నీవు న్యాయం కోసం అడుగేస్తే
అవినీతి ముళ్ళపొదలు అడ్డుకట్ట వేస్తాయి
మంచి చేసినవాడు నాయకుడు కాడు
అరచేతిలో ఆనందాన్ని చూపేవాడు మగాడు
కల్మషం నీకు తెలియదు
తప్పు చేయడం చేతకాదు
కుళ్ళు, కుతంత్రాలు అలవాటులేవు
లౌక్యం తెలియని అమాయకుడివి
సారీ... మూర్ఖుడివి
ప్రస్తుత సమాజంలో అంతే...
నీ జీవితాన్ని ధారబోసి
కుటుంబ ఆనందానికి దూరమై
పసిమొగ్గల మనసును గాయంచేసే బతుకెందుకురా?
నీ వృత్తికి న్యాయం చేసినా
వ్యవస్థను మార్చే శక్తి ఎవరికీ లేదు
ఒక్క అవకాశవాదికి తప్ప
భవిష్యత్ ఉన్నవాడివి – ఈ ఉద్యమాలు నీకొద్దురా...
ఒరేయ్ బండోడా...!
నువ్వు చాలా మంచోడివి...
మంచు లాంటి నీ మనసు ఈ కల్మషాలలో కరిగిపోతూనే ఉంటుంది
అందుకే నీ వృత్తిని ఆస్వాదించు – ప్రవృత్తిని ఆరాధించు
స్నేహితులను ప్రేమించు – శ్రీధర్ నా మాట వింటావు కదూ!

# అవినీతికి అభిషేకం

ప్రజాస్వామ్యం పరిణతి చెందింది
ప్రజల మనోభావం పరిపక్వత దాల్చింది
మర్డర్లు, మానభంగాలు మామూలైపోయాయి
అవినీతి ఆదర్శబాటగా అందలం ఎక్కింది
సామాజిక పయనం కొత్త కలలకై విహరిస్తోంది
అవినీతిని చట్టబద్ధం చేయాలన్న కొత్త తలంపు
భుక్తి గడవని దేవదాసిని సాని అంటే
కొత్తరుచుల కోసం ఆరాటపడే అంగడిబొమ్మలు సెక్స్‌వర్కర్లట...
సెక్సును చట్టబద్ధం చెయ్యాలన్న ఉద్యమం పొగలా రాజుకుంటోంది
పైశాచికత్వానికి అక్షరరూపం
దుర్మార్గుల కర్కశత్వానికి సంభాషణల పలకరింపు
రేటింగుల కోసం బ్రేకింగ్ న్యూస్‌లు
దైవత్వం మూర్తీభవించిన స్వామీజీల రాసలీలలు
ప్రజల మనసు ముత్యం... అందుకే అవినీతికి అభిషేకం!

ప్రేచ్ఛడు

# ఓ తీవ్రవాదమా!
# ఆపు నీ ఘోరకలి

ప్రశాంతగా సాగుతున్న జీవనం... అంతలో...
తీవ్రవాద ఉన్మాదం, మతఛాందసం కురిపించిన హాలాహలం
సాఫీగా సాగే గమ్యంలో పెనుతుఫాను
ఓ గుండె బాధ, ఓ నిర్జీవదేహం నిస్సహాయత
కడుపుకోతతో మాయని గాయం మిగిల్చిన ప్రశ్న
రక్తపుటేరుల రాదారి, వ్యధాభరిత ఎడారి
ఎన్నో కుటుంబాలలో వాడిన సుమాలు
దారుణానికి సాక్షిగా మిగిలిన జీవచ్ఛవాలు
కర్కశత్వపు హవా, కాఠిన్యపు జాడ
అర్థంలేని లక్ష్యం, జీవన మాధుర్యంలో అంతులేని నిర్వేదం
ఓ తీవ్రవాదీ! నువ్వూ మనిషివే...
స్వార్థంతో సిద్ధాంతం లేని పోరాటం చేస్తూ
నరమేధం చేస్తున్న నువ్వే చేసుకో నీ అవయవ చేధనం
యంత్రాంగ వైఫల్యం నీ విస్ఫోటనానికి దాసోహమైతే
శోకతప్తతతో నాదేం తప్పని రోదిస్తోంది
అమాయకుల అవయవ శేషం
ఘోరం జరుగుతూనే ఉంది
కిరాతకంలో మార్పు రాకపోతే –
అసువులు బాసిన ఉసురులో మాడి మసైపోతావ్
దేశప్రగతికై ప్రతి ఒక్కరూ వెయ్యాలి ఒట్టు –
తీవ్రవాదాన్ని పెట్టాలి మట్టు
ఓ తీవ్రవాదమా!
ఇక వేదన మిగల్చకు... ఆపు నీ ఘోరకలి.

*హైదరాబాద్ బాంబు విస్ఫోటనంలో*
*ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తూ...*

# ఉగాదికి నివేదన

వసంతం వస్తూనే విజయం అంటోంది
తొందరపడకు ఉగాది పర్వమా నీతో ఊసులాడాలి
నా బాధ నివేదించాలి - నా కోరిక ఆవిష్కరించాలి
వసంతాలు వస్తూనే ఉన్నాయి.
కల్మషాల మనస్తత్వాలు మారడంలేదు
అవినీతి పడగలు బుసకొడుతూనే ఉన్నాయి
ఇదంతా మామూలేనని జనసంద్రం అలవాటుపడిపోయింది
బక్క బతుకుల వేదన, సామాన్యుల రోదన -
కలుషిత గాలిలా వ్యాపిస్తున్నాయి
ప్రతి పండుగకీ మధ్యతరగతి బతుకుబండి భారంగా సాగుతూనే ఉంది
రాజకీయం ప్రతి ఒక్కరికీ వంటపట్టింది
నాయకుడెవరో తెలియడంలేదు
బాంబుల వర్షాలు, వికృతమైన మానవ సంబంధాల పైశాచికత్వాలపై
సంచలన వార్తలు వినోదమై విలయతాండవం చేస్తున్నాయి
సెల్లుఫోను ప్రతి ఒక్కరి నేస్తమయ్యింది
పరువు కోసం ఫాల్స్ ప్రెస్టేజ్‌లు కామనయ్యాయి
'భక్తి' మార్కెట్‌లో కొనే రెడిమేడ్ వస్తువయింది
భక్తుల నైవేద్యం కోసం భగవంతుడు,
భగవంతుని అనుగ్రహం కోసం భక్తులు
ఇచ్చిపుచ్చుకునే లంచాలు రొటీనైపోయాయి
మానవతా విలువలు, సామాజిక కట్టుబాట్లు...
మాట్లాడాలంటే భయంగా ఉంది
అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చిందంటే అసాంఘిక శక్తులు ఊరుకోవు కదా
నిజజీవితపు మృగత్వానికి,
క్రూరత్వపు టీవీ సీరియల్స్ అగ్నికి ఆజ్యంలా తోడై ఉన్నాయి
విజయనామ సంవత్సరాన్ని నే కోరుతున్నా...
కొండలు పిండిచేసే ఎండలు కాయించద్దని
గుప్పెడు నీటికోసం ఎడారి ప్రయాసలు తీసుకురావద్దని
బాంబుల ధాటికి అమాయకులు జీవన దుర్భరం ఇక ఆగాలని
మతఛాందసుల మనస్తత్వం మాయమై వసంతాలు విరబూయాలని

తెలుగుతనం ప్రతిబింబించి, పాశ్చాత్య పోకడ సమసిపోవాలని
నిర్భయ లాంటి ఛిద్రమైన దుస్థితి ఇక రాకూడదని
ప్రతి స్త్రీ నిర్భయంగా స్వేచ్ఛా జీవనం సాగించాలని
ఆకాశాన్నంటుకున్న ధరలు భూమిపై విహరించి
ప్రజల వెతలను తీర్చాలని
నే అభ్యర్థిస్తున్నా, నివేదిస్తున్నా...
ప్రతి ఒక్కరి కల సాకారం కావాలని
అందుకే ఏటేటా వెల్లివిరుస్తున్న ఉగాది నేస్తమా!
ఈ విజయనామ సంవత్సరం నుండైనా
సృష్టించవా విజయాల ఒరవడి.

*ఉగాది కవి సమ్మేళనంలో*
*పత్రికా ప్రశంసలు పొందిన కవిత*

# ఓ పసిమొగ్గా క్షమించు...
# ఓ సోదరీ క్షమించు...

చిగురించే పసిమొగ్గలను చిదిమేస్తే
దుర్మార్గం కాదది, శాడిజం కాదది... నరనరాన జీర్ణించిన మృగత్వం
తల్లి, చెల్లి, కూతురు బంధాల బాటలో
పరాయి స్త్రీని సోదరిలా భావించలేని మృగం
తప్పుచేసినవాడే మృగం కాదు
పసి హృదయాన్ని చూసి కూడా పొగలుకక్కే వికృతరూపాలు
చిదిమేస్తే చిగురించవు పసిమొగ్గలు
సొంతస్త్రీలని పరాయివాడు మాటంటే తట్టుకోలేని వ్యక్తి
పరాయిస్త్రీలపై కక్కే విషజ్వాలలు
ఒక నిర్భయ కాదు – ఐదేళ్ల పసిమొగ్గ కాదు
ఎందరో అభాగినుల కన్నీటి ధారాపాతం
ఇది ఈ రోజు ప్రారంభమైంది కాదు ముగియడానికి
అనాదిగా వస్తున్న మన రాజకీయ కౌగిలిలో నలుగుతున్న చట్టాలు
పోరాటం చేస్తున్న సంఘాలకే లేని చిత్తశుద్ధి
మానం, మానవత్వం మరిచేవాళ్లే మానభంగంపై మైకు పడితే
చేతకానితనమా, చేయూత నీ లక్ష్యమా
సంఘటనకు సమయంలో మాత్రం స్టేట్‌మెంట్లిచ్చే నాయకులు
జరిగిన ఘోరాన్ని రోజంతా కళ్లలోనే ఉంచే దృశ్యరాజాలు
ఈ కలి ఆగాక ఘోరకలి జరగకుండా నోరు మెదపకున్నాయి
పసికందని చూడని, అమాయక అబల అని చూడని
మగపశువులకు చెయ్యాలి అంగచ్ఛేదనం
దేవుడా నిన్ను కోరుతున్నా, నీ మనసూ మారిందని నిందేస్తున్నా
నువ్వు పుట్టించిన మనిషిపై మనసు పెట్టు – ఓ స్త్రీని పాడుచేయాలన్న
ఆలోచన వచ్చినవాడికి నపుంసత్వకాన్ని ప్రసాదించు
మారు... మారు... మారుమ్రోగించు యువతా ఇది నీ యుగం
గళం విప్పు, కలం పట్టు, పిడికిలి బిగించు, ఎలుగెత్తు, గొంతు చీల్చు
ప్రభంజనం... ప్రభంజనం... ఇది అందరికీ కావాలి నవశకపు గమ్యం
ఓ పసిమొగ్గా క్షమించు... ఓ సోదరీ క్షమించు

ప్రశ్నేడు

# అనుబంధాలది ఏ దారి

సీతను చెరపడితే... రావణ సంహారం
విలువలు మృగ్యమైతే మృగత్వపుఛాయలు
అర్ధనగ్న దృశ్యాలు – తలదించుకునే సమాజం
పరాయి వ్యామోహం పాపంగా చూసే సంస్కృతి
చెదపట్టేసిన ఉపన్యాసాలను పదాలుగా వాడినా
నరనరాన సెగలు రేపుతున్న హాలహలదృశ్యాలు
బంధాలు, అనుబంధాలు ప్రశ్నార్థకం
సవతి ప్రేమను భరించలేని బంధాలు
అద్దె గర్భాన్ని పంచుతున్న ఆధునిక మాతలు
దేవుడిచ్చిన వరమని భావించే రోజులు హరించి
శీలం అనే అర్థానికి స్వరూపం మారిన నవతరపు రోజులివి
తన అమ్మతనాన్ని వేరొక అమ్మ భరిస్తే
కూతురి ఆవేదనను తన గర్భంలో దాచుకునే ఓ తల్లి
వీటికి కొత్త అర్థాలు ఎలా పుడతాయో అద్దెకు అమ్మ పుట్టినట్లు
ఓ కూతురికి తల్లి సవతా, మరి అల్లుడికి, మనవడికి
అద్దె గర్భం దాల్చిన పరాయితల్లి ఏ రక్తసంబంధం
అక్రమమా, సక్రమమా, అనుబంధమా, అనుమానమా
పాశ్చాత్య దేశాలు మన సాంప్రదాయాన్ని అనుకరిస్తుంటే
లేని పాశ్చాత్య సంస్కృతికి మేకప్ వేసే మన మృగాలది ఏ బంధం?
బంధాల జాడలేని అడవి సంపదలా?
నాగరికతను దుర్గతి పట్టించే ఆటవికులా!?
ఓ మై గాడ్... నువ్వే రక్షించు...
ఈ అకృత్యాలు ఆలోచిస్తేనే జుగుప్సాకరం
దేవుడి దయ లేకుండా కొత్తదారులు సృష్టిస్తున్నారు...
ఓరి భగవంతుడా నువ్వేమైపోయావ్!?!

# సమరం ఆపకు హజారే...

ఊపిరి ఆగినా... బాసలు మరిచినా...
అవినీతి రక్తపుటేరు పారుతున్న భారతావనిని...
బానిస బతుకు సాగిస్తూ... మదమెక్కిన మేలితునకల...
ముసుగు బారినుండి తప్పించు హజారే...
నీ శ్వాస ఆగదు... నీ ఊసులు ఆగవు...
నీ ఉద్యమం వెనుక ఆర్తి ఉంది...
నీ ఉద్యమంలో స్ఫూర్తి ఉంది...
యువత... యావత్ ప్రపంచం నీ హృదయంలో ఉంది...
సెకనుకు మాట మార్చే కుచ్చిత నాయకుల మాట...
పెడచెవిన పెట్టి పోరాడు... పోరాడు... పోరాడు...
మళ్లీ స్వాతంత్ర్యం కోసం పోరాడు... ఈ నల్లదొరల నుండి...
మనకోసం కాదు... రేపటి తరం కోసం...
రేపటి వెలుగు కోసం...
సమరం ఆపకు హజారే...
తుమ్హారా భారత్ మహాన్...

*ఈనాడు దినపత్రిక - 27-8-2011*

# తెరచాటు బంధాలు

చిరిగిన చీరలో తనువు దాచుకోవాలని తాపత్రయ పడుతోంది ఓ మగువ
ఖరీదైన బెడ్లపై విరహతాపంతో వివస్త్రయి ఊగుతోంది ఓ అతివ
ముళ్లపొదల్లో ఓ పసికందు,
కుప్పతొట్టిలో కళ్ళుతెరవని శిశువు
పీక్కుతినే కుక్కలు – రోదించే మనసులు
పేగుబంధాన్ని కాలరాసే కర్కశ హృదయాలు
చైతన్యం ఎక్కువైన ప్రచార మాధ్యమాలు
కాలగర్భంలో కలిసిపోయే వాస్తవాలు
పరాయిస్త్రీపై రెప్పవాల్చని ప్రబుద్ధులు
రెండు జంటలు కలిస్తే వారిది ఏ బంధమో...
అని అనుమానించే సమాజం
పార్కుల్లో విచ్చలవిడితనం మనకెందుకులే...
అని కళ్ళుమూసుకునే చట్టం
రెండు తనువులు కలిస్తే ప్రణయం
తనువులు తనువులై తడిస్తే ప్రళయం
పరాయి పనులపై వ్యామోహం – నిత్యం జరుగుతున్న అకృత్యం
పేదబతుకు గడవని ఓ బక్కప్రాణి – ప్రేమ ఎక్కువై ఓ కలల రాణి
నిత్యపైత్యమై చలాయిస్తున్న వాత్సాయన సూత్రం
తాళి కడితే భార్య, కట్టకపోతే కులట
ఈ కట్టుబాట్లు తెంచుకుని పుట్టింది నవనాగరికత
క్షణంలో మాంసపు ముద్దలయ్యే శరీరాలకు సహజీవనమట
తెరచాటు బంధాలు, తలదించుకునే నిజాలు
ఏ సంస్కృతిలో జీవిస్తున్నామో తెలియని స్థితి
ఇటువంటి సాంప్రదాయాలా మన భారతీయగతి?
మన అంటే భద్రం పర అంటే వెకిలితనం
నీ మనసుపై ఒట్టు పెట్టు...
సమాజంలోని విశృంఖలాలను మట్టుపెట్టు...

# ఇది ప్రజాస్వామ్యం బాసూ!

ఎప్పుడు విడాకులిస్తారో – ఎంతకాలం సహజీవనం చేస్తారో
ఏడడుగులు ఎలా వేస్తారో – ఎవరు ఎవరితో నడుస్తారో
ఇదీ నేటి రాజకీయ ముఖచిత్రం, ప్రజాస్వామ్యంలో విచిత్రం
ఎప్పుడు ఏ రంగో – ఎప్పుడు ఏ జెండాయో
ఎవరితో కలుస్తారో – ఎలా విడిపోతారో
చిత్తశుద్ధి లేని నాయకులు – నటనలో ప్రవీణులు
పరస్పర దూషణ, వేరే పార్టీ స్థాపన
వరించే విజయం... బేరసారాలు వారి నైజం
వదిలిన పార్టీకే తిరిగి కొడతారు సలాం... సలాం...
అధికార గణాన్ని వ్యతిరేకిస్తే నీ అవినీతి రట్టు
నీ వ్యక్తిగత జీవితం కటకటాలు లెక్కపెట్టు
దాసోహం అన్నావా వెంటనే వస్తుంది క్లీన్ చిట్టు
ఈ ఊసరవెల్లుల చేతిలో అధికారులు, చట్టాలు చిత్తు... చిత్తు...
ఇదీ నేటి రాజకీయనాయకుని జీవనశైలి
నాణానికి మరో కోణం – ఓటరు మనోఫలకం
సామాన్యుడు శాసిస్తున్నాడు, మేధావి మౌనంగా ఉన్నాడు
ఓటరులో చైతన్యం పెరిగింది, సమాజంలో ఓ వింత మార్పు
నోటుకి ఓటుని తాకట్టు పెట్టినా మనసుకి లేని చింత
ఆత్మసాక్షి లేదు అంతా అవినీతే కదా అన్న సంతృప్తి తప్ప
ఓటు లేకపోతే ఊరుకోవట్లేదు వచ్చే కాసులు వలసపోతాయని
నోటు రాజకీయనాయకుడు ఇవ్వక్కర్లేదు
నోటు పడందే ఓటు పడడంలేదు
జనంలో ఎంత మార్పు – ఇద్దరి మధ్య ఒకే భావన
ఇక్కడ వ్యాపారమే తప్ప అభివృద్ధి ప్రశ్నే లేదు
ఇది అంతర్ఘోషే తప్ప ఆచరణ సాధ్యం కాదు
చేసేది చెప్పరు – చెప్పింది చెయ్యరు
ఇది ప్రజాస్వామ్యం బాసూ!

పిచ్చోడు

# ఉ'దయ'లేని కిరణాలు

చిగురించే ఆశలకై ఉదయించిన కిరణాలు
వెలుగులు వెదజల్లి వినీలాకాశంలో వెల్లివిరిసాయి
వెలుతురును ఆస్వాదించే ఈ లోకం
కాంతులు విరజిమ్ముతుంటే కళ్లు బైర్లుకమ్మి
తనలోని క్రూరత్వాన్ని వెలికితీసి
కులమతాల ముసుగులో బలాబలుల చదరంగంలో
రంగుల ప్రపంచంలో కలల విహంగానికి మరకలు వేసి
అహంకారదర్పంతో అణగదొక్కిన మదపుటేనుగులు
ఇది వాస్తవం.
ఒక రంగంలో కాదు... ప్రతి జీవితానికీ పీటముడి
జీవనయానంలో బలహీనుడు చస్తూ బతుకుతున్న వైనం
ప్రతిభకు పట్టిన దుర్గతి, పైశాచికుల ఆనందానికి లేని అవధి
జీవితం నాశనం చేసినా వారిది కరగని హృదయం
వారందరిదీ ఒకే కులం... డబ్బు ఉందనే మదం...
కిరణాలు ఉదయిస్తూనే ఉంటాయి – అస్తమిస్తూనే ఉంటాయి...
ఆశకు, నిరాశకు మధ్య – ఆరాటానికి, పోరాటానికీ మధ్య
ఉదయించే కిరణాలు...
లోకం స్థితిని, గతినీ శాసించే కిరణాలు...
అలసి, సొలసి ఉ"దయ"లేని కిరణాలుగా మారుతున్నాయి
ఓ దయలేని కిరణమా ఈ భయంకర మార్పు వద్దు
మనుషుల హృదయాల్లో మంచి వెలుగై ప్రసరించు

# మగువా నీకివే నమస్సులు

మగువ జీవితం చిగురుటాకుల జీవనం
స్వేచ్ఛాజీవనం విహంగమై గతి తప్పుతున్న వైనం
అనాదిగా అనాగరికంగా ఆడవారిపై అత్యాచారాలపర్వం
శృతి తప్పిన సమాజం నిస్సహాయతకు నిదర్శనం
బంధాలుండగానే రాసలీలలు సాగించే ఓ అతివ
సమాజం కోసం చర్చించే పరిణతి చెందిన ఓ సబల
అమాయక స్త్రీలను అంగడి బొమ్మలు చేసే ఓ మగువ
ఉపన్యాసాలకు పరిమితమై యవ్వన దీపికల శీలాన్నార్పే సంస్కర్త
నిత్యం మగువపై అరాచకం చేసే మృగాడు
నిర్వీర్యమౌతున్న చట్టాలు...
నిర్భయలు బలౌతున్నా ఆగని దాష్టీకాలు
మృగాళ్ళ మూర్ఖత్వానికి అపార సొబగులు చూపించే మగువల కవ్వింపు
సాంప్రదాయ వస్త్రధారణే పాపంగా
సగం దుస్తులు ధరించే అందాల రాశులు
సమస్య మూలాలు గుర్తించని నారీమణులు
పగలూ రాత్రీ మరిచి పబ్బుల్లో చిందులేసే ఖరీదైన కన్యలు
మగాడితో పోటీగా మగువల చేతుల్లో మధుపాత్రల గలగలలు
విందుపొందుల విశృంఖలాలు...
ప్రియుడి కోసం మానవత్వాన్ని మంటకలుపుతున్న ఆధునిక మాతలు
ఇది దారి తప్పిన సమాజానికి సజీవ సాక్ష్యం
మగాడిదా, మగువదా తప్పెవరిదని ఆలోచిద్దాం
మగాళ్ళందరూ మృగాళ్ళు కాదు మానవత్వం మృగ్యం కాలేదు
మగువలందరూ గతి తప్పలేదు స్త్రీపై గౌరవం నశించలేదు
మగాడినే 'కని'పెట్టిన మగువా నీకివే నమస్సులు.

# కవిగా అడుగులేయించిన లేఖలు

పరిచయాలు ఉండనక్కరలేదు. ఒక ప్రోత్సాహం ఎంతవరకు నడిపిస్తుందో, జీవితంలో ఉన్నత శిఖరాల వైపు నడక సాగించేలా స్ఫూర్తి నింపుతుందో అన్నదానికి ఈ లేఖలు ఒక ఉదాహరణ. రచయితగా పదాలు సాగించాలనుకొన్నపుడు ఎన్నో నిరుత్సాహాలు ఎదురైనా నన్ను పరిణితి సాధించాలని సూచనలిస్తూ అప్పటి ఆంధ్రప్రభ ఎడిటర్ గౌరవనీయులు శ్రీ వల్లూరి రాఘవరావు గారు వ్రాసిన లేఖ ప్రేరణ కల్గించి నాలోనే కాదు నా స్నేహితుల్లో కూడా కొత్త ఆలోచన రేకెత్తించి 'నాలో' పుస్తకం ప్రచురణ పొందింది. నా 'నాలో' పుస్తకాన్ని అభినందిస్తూ ఇంకా మంచి సూచనలిస్తూ ప్రఖ్యాత రచయిత, చిత్రకారుడు శ్రీ బ్నిం గారు వ్రాసిన లేఖ మరో అడుగు ముందుకు వేయించి ఈ పిచ్చోడు పుస్తకానికి శ్రీకారం చుట్టుకుంది. అక్షరాలు రాద్దామని ప్రయత్నించిన నాకు కవిగా సమాజంలో మంచి గుర్తింపు వచ్చేలా చేసిన లేఖలను హృదయస్తం చేసుకోవడం తప్ప ఏ విధంగా వారి ఋణం తీర్చుకోగలను. ఈ ప్రస్థానంలో అద్భుతమైన సలహాలతో నా పయనాన్ని కొనసాగించేలా చేస్తున్న ఎందరో మహానుభావులు - వారందరికీ నా పాదాభివందనాలు.

**- మనాశ్రీ**

---

18-12-1999
హైదరాబాద్

***మనాశ్రీ గారికి,***

నమస్కారం. మీ కవితలు చదివాను. ఒక కవిత స్వీకరించి త్వరలో ప్రచురిస్తున్నాను. కవితలు రాయడంలో మీకు గల ఉత్సాహానికి అభినందనలు. అయితే మీరు కాస్త హెూమ్‌వర్క్ చెయ్యాలి. కవిత్వం అనేది అందమైన వాక్యాల మధ్య ఇమిడ్చే స్టేట్‌మెంట్ కాదు. దానికి హృదయం భావుకత కావాలి. ఫీలింగ్‌లో సాంద్రత వుండాలి. ఆ దిశగా ఆలోచించి మరిన్ని మంచి కవితలు రాయండి.

అభినందనలతో...


(వల్లూరి రాఘవరావు)

14-9-2000
హైదరాబాద్

***మనాశ్రీ గారికి,***

మీ ఉత్తరం అందింది. మీరు నిరాశ చెందవద్దు. అనేక ప్రయత్నాలు చేస్తేనే ఫలితం వుంటుంది. బాగా చదవండి. బాగా ఆలోచించాలి. అదే సమయంలో పరిశీలనా శక్తిని పెంపొందించుకోండి. మీ కవితలను పరిశీలించి త్వరలో ఏ విషయమూ తెలుపుతాము. ఒక్క కవితా ప్రక్రియనే కాకుండా మిగతా సాహితీ ప్రక్రియలను అధ్యయనం చేసి ఆ ప్రక్రియలలో రచనలు చేయగలరు.

అభినందనలతో...



(వల్లూరి రాఘవరావు)

---

# అప్పట్లో... 'నాలో' గురించి...

12-12-2008

***మిత్రమా మనాశ్రీ నమః!***

'నాలో' కవితా సంకలనం అందింది. చాన్రోజులు కూడా అయింది. అంతేకాదు... చదివేసి కూడా! బాగుందని ఫోన్లో అన్నాననుకున్నా! కాదా...?! అయితే సారీ!

సరే... మళ్లీ పుస్తకం ముందు తెరుచుకొని... మళ్లీ చదివేక బాగుందిలోంచి... బాగానే వుంది - బానే వుందిలూ... పర్లేదులూ... అనిపించాయి. నిజాయితీగా ఇలా రాస్తే గానీ... రాయమన్న మీ తిక్క... రాద్దామనుకున్న నా తిక్క వదల్దు!

ఓ మాటలో... 'బావుంది... వేగం! చాలా బాగుంది వేడి!' ముఖ్యంగా... అంటే మొదట్నించీ వస్తే... 'జీవన సమరం' -

రైలు ఏ తీరాన ఆగిపోతుందో తెలియని... ప్రమాదాల వ్యాపార ప్రయాణం. తీరం చేరకుండా సమరం సాగించమనేలా వుంది!

మీరు 'పరకాయ ప్రవేశం' బాగా చేస్తున్నారు.

నల్లత్రాచు కాటేసినా... గిలగిల్లాడుకుని పామే చచ్చే... మాట చెప్తూ...

'మనిషి మృగం'లో అహమస్మి అన్నారే... అది జోకేగా! మీకు హృదయం వుంది సార్!! అవును ఆ కవిత అదే స్పష్టపరిచింది! నిర్భీతిగా నిజం వప్పుకునేవాడు... నిజానికి మనీషి.

'సమాజమా... నీ పయనమెటు?' అని మీరేసిన రాళ్ల గురి ఎటు...?? పట్టుకోలేకపోయా – స్త్రీ మనోగతం మారుతోందనీ... అబలల ఆర్తనాదాలు మిన్నంటాయనీ... కన్నెలు సైతం 'కలియుగ కుంతులు అవుతున్నారంటూ మీ(వ్రాసిన కవిత ఎవర్ని టార్గెట్ చేసినట్లో నా మెదడుకి అందలేదు –

'నరం' తెచ్చుకోమని నాలికని అడ్డెట్టి గొప్పగా చెప్పారు.

'ఉగాది న్యూసెన్స్' చదివాను –

సంవత్సరాల పేర్లు మారుతున్నాయి. మీలాంటి కవులు అలాగే చూస్తూ... రాస్తూ... చివరికి ఆశిస్తూ... ముగిస్తారు!

కొత్త అర్థం అంటే ఒప్పుకోను. మళ్లీ పాత కోకిల పాటే అనిపించింది! సారీ!

'మధ్యతరగతి మహాభారతం' పాత బ్లాక్ & వైట్ ఫొటోనేగా?

'కొత్తకోణం' సందర్భన నిజమే గానీ లంచాలు దండీగా తీసుకున్నవాడు దారిద్ర్యం తాండవించడం పచ్చి అబద్ధం కదూ... మీదో పిచ్చి శాపం పోనీ!!

ఎన్నికల సంరంభం... కవితలో రాయాలా? జనవాణి యథాతథమేగా –

"అసమానతలకు మారుపేరు దోపిడీ...

ఆరని అగ్నిగోళం దోపిడీ"యే. ఆ రెండు వాక్యాలు ఆలోచిస్తే ఆరవు... ఆ అగ్నికీలలు – మీరన్నదానికి – వెయ్యి కీలలు కనిపిస్తున్నాయి. జయోస్తు!!

'మహాప్రస్థానం'లో 'బిక్షువర్షీయసి' మళ్లీ జండర్ మార్చి రాయాలా మహానుభావా? ఈ అనువాదాన్ని మీరీ సంకలనంలో వేసేముందు కొంచెం ఆలోచించాల్సిందేమో? లేదా... క్రింద మహాకవి ప్రస్తావనైనా తేవాల్సిందేమో...

"నాలో" కవితా సంకలనం డిజైనింగ్‌లో పేజీలు నేను తనికెళ్ల భరణి గారి 'పరికిణీ' పుస్తకానికి వేసిన లేఔట్...'గా' కనిపించింది.

ధన్యోహం...

ఇంతకీ...

మీ కథనశక్తికీ... కవితానురక్తికీ...

మనపూర్వక అభివందనం!

మరిన్ని కవితా సంకలనాలు వెలువరించేందుకు స్వాగతం.







# వ్యవస్థ పట్ల మరింత కోపం రావాలి

లబ్ధప్రతిష్టుల ముందుమాటతో రచయిత కవితావేశంతో సహవాసం చేసొచ్చిన పాఠక హృదయాలను పరామర్శిస్తూ సింహావలోకనం చేయించే ఆఖరిమాట వ్రాయమన్నప్పుడు తగువాడనా అని బిగుసుకుపోయిన జ్ఞప్తి ఇంకా ఉంది. కాని కవితల్లోకి వెళ్లేకొద్దీ కవితత్వం, కవితాతత్వం బోధపడి మది సమాధానపడింది.

రాజకీయనాయకుడికి కోపం వస్తే మౌనంగా కక్ష తీర్చుకుంటాడు. సగటు మనిషికి కోపం వస్తే పెళ్లాం బిడ్డలపై చూపుతాడు. శాస్త్రవేత్తకి కోపం వస్తే క్రొత్త విషయం సాధిస్తాడు. దేవుడికి కోపం వస్తే తను సృష్టించిన సృష్టినే నాశనం చేస్తాడు. మరి రచయితకి వ్యవస్థ పట్ల కోపం (ఆలోచన) వస్తే అక్షరమథనం చేస్తాడు. దాని రూపమే 'పిచ్చోడు'.

రచయిత మనాశ్రీకి సమాజంపై శ్రద్ధ ఉంటూనే నైజాలపై క్రోధం ఉంది. చెరిచే కామాంధుడికి తోడు చర్చలతో రచ్చ రచ్చ చేస్తున్న మాధ్యమాలది ఉన్మాదం కాదా అనడం బావుంది. శివుడు గరళం మింగితే నరుడు సత్యాన్ని మింగేస్తున్నాడు. మింగలేనివాడు పిచ్చోడు. 'అవినీతి తాండవిస్తోంది – అందులో నేనొకడిని... గుంపులో గోవింద' అనుకునే జనం పెద్దవాడు చెప్పే అబద్ధం నిజం అవుతుంటే, పేదవాడు చెప్పే నిజం అబద్ధం చేసి పిచ్చోడిని చేస్తున్నారు. 'వాటాలు తీసుకునే దేవుడు అవతారాలు ఎత్తడం మానేశాడ'న్నారు కాని, అవినీతిని అణచబోయే ఆ ప్రతిరూపాలను మనం పిచ్చోళ్లను చేస్తూనే వున్నాం కదా...

గర్భం ధరించలేని కూతురు ఆవేదన తన గర్భంలో దాచుకునే ఓ తల్లి ఆ కూతురికి సవతా... మరి అల్లుడికి? మనవడికి...? అద్దె గర్భం దాల్చిన సగటు తల్లి ఏ సంబంధం? అక్రమమా? సక్రమమా? ఈ ఆకృత్యాలు ఆలోచిస్తేనే జుగుప్సాకరం... ఓరి భగవంతుడా! నువ్వేమైపోయావు...? నీ దయ లేకుండానే క్రొత్త దారులు సృష్టిస్తున్నారు. పాశ్చాత్యదేశాలు మన సాంప్రదాయాలను అనుసరిస్తుంటే మనం వాళ్ల విశృంఖలాలకు బానిసలవుతున్నాం... అంటూ అద్దెగర్భం పంచుకునే ఆధునిక మాత కోసం వెతచెందారు.

సమాజం పట్ల తన బాధ్యతను నిర్వర్తిస్తున్న హజారేని హర్షిస్తూ, 'ఈ నల్లదొరల నుండి మన కోసం కాదు... రేపటి తరం కోసం, రేపటి వెలుగు కోసం సమరం ఆపకు' అంటూ సమర్థించడం బావుంది.

ఎవరు ఎప్పుడు విడిపోతారో, ఎంతకాలం సహజీవనం చేస్తారో, ఏడడుగులు ఎలా వేస్తారో, ఎవరు ఎవరితో నడుస్తారో... ఇది నేటి రాజకీయ ముఖచిత్రం. 'ఇది ప్రజాస్వామ్యం బాసూ' అంటూ రాజకీయాలను సహజీవనంతో పోలుస్తూ రెంటిపైన సూటిగా సారించిన

అస్త్రం బావుంది.

సాంప్రదాయ వస్త్రధారణే పాపంగా సగం దుస్తులు ధరించే అందాలరాశులు పగలు రాత్రి మరచి పబ్బుల్లో చిందులేసే ఖరీదైన కన్యలు... మగాడితో పోటీగా మధుపాత్రల గలగలలు... విందుపొందుల విశృంఖలాలు... ప్రియుడి కోసం మానవత్వం మంటకలుపుతున్న ఆధునిక మాతలు – ఎటు పోతున్నాం మనం –

వ్యవస్థను మార్చే శక్తి ఎవరికీ లేదు, ఒరేయ్ బండోడా నువ్వు చాలా మంచోడివి, మంచు లాంటి నీ మనసు ఈ కల్మషాలలో కరిగిపోతూనే ఉంటుంది అని ఉద్యమాల కోసం పోరాడే తన మిత్రుని గురించి ఆరాటం, క్షణంలో మాంసముద్దలయ్యే శరీరాలకి సహజీవనమా అన్న ఆవేదన, సెక్కు వర్కర్లట, సెక్సును చట్టబద్ధం చెయ్యాలన్న ఉద్యమం పొగలా రాజుకుంటోంది అని విచక్షణ మరచి పోరాడే వారి కోసం మనాశ్రీ పడ్డ బాధ, ఒక భారతీయుడు, ఠాకూరు, బ్రోకర్ సినిమాల్లో లంచం తీసుకునేవాళ్లని ఏం శిక్షించారయ్యా అంటూనే డ్రాయరు సొరుగులో బరువు పెట్టందే పని చెయ్యని ఘనులు, అవినీతి అధికారిగా ముద్రపడ్డ వ్యక్తి సన్మానసభలో మీ లాంటి రచయితలు స్పందించి అవినీతిపై పుస్తకాలు రాయాలని అన్నప్పుడు ఎదురుగా తిట్టాలని ఉన్నా, సమాజం కోసం మౌనంగా ఉన్నా, తప్పుని ఖండించే శక్తి ఉండీ మాట్లాడక పోవడం మానసిక వ్యభిచారం చేసినట్లే అని కవి తనని తనే అంతర్మథనం చేసుకోవడం. చివరికి తను అవినీతిపై రాసిన పుస్తకం బావుందంటూ తృణమో పణమో తీసుకుని గాని పనిచేయని మహానుభావులుండడం నేటి సమాజానికి అద్దంపట్టే తీరుకి వ్యధచెందడం, కవి యొక్క పరిణతికి, సమాజం యొక్క దుర్భర స్థితికి సజీవ సాక్ష్యం ఈ 'పిచ్చోడు'.

ఇలా పలురీతిన దారి తప్పిన సమాజాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన రచయిత మనాశ్రీ గారికి వ్యవస్థ పట్ల మరింత కోపం రావాలని, మరిన్ని పిచ్చోళ్ళు ఆవిష్కరించబడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ...

వల్లూరిపల్లి రమేష్
సినీ నిర్మాత - మహర్షి సినిమా
వైస్ ఛైర్మన్: ప్రొడ్యూసర్స్ సెక్టార్,
ఎ.పి. ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్



# మన మనాశ్రీ

ఈయన పేరు మనకు తెలియదు. ఈయన కలం పేరు మాత్రం ఆంధ్రదేశం అంతా తెలుసు. 'మనాశ్రీ మనవాడే సుమా' అని కవికులం పులకిస్తుంది. చూపులకు ఈ అబ్బాయి 'బాబూ' అని పిలిచే బాల్యంతో విరిసే గ్లామర్ బోయ్. 1973లో పుట్టిన ఈ స్కార్పియో చలితేలులా దుష్ట సమాజాన్ని కుట్టే చురుక్కుల కవి. నాన్న శ్రీ మద్దూరి గణపతిశాస్త్రి రంగుల్తో బొమ్మలేస్తే, ఈయన అక్షరాల్తో చిత్రాలు వేస్తున్నారు. అమ్మ అన్నపూర్ణమ్మగారు ఈ పుత్రుణ్ణి రహస్యంగా సరస్వతీదేవికి దత్తతిచ్చేసారు.

పెన్ను పట్టిన ఈయన తనకన్నా పెద్ద రచనలు చేస్తూ కవిప్రసిద్ధుడవుతున్నాడు. తెలుగునాట ప్రముఖ పత్రికలు ఇతని అక్షరాలకు హారతులిచ్చాయి.

కవితలుగా, కథలుగా, గజల్స్‌గా, సినిమా పాటలుగా ఆ అక్షరాలు అఖండ జ్యోతులవుతున్నాయి. అందులో కొన్ని ఇలా సంకలనాలవుతున్నాయి. సహస్రాధిక ప్రముఖులు ఈయన అక్షరాలను సన్మానపత్రాలుగా ఇళ్లలో అలంకరించుకున్నారు. సర్వశ్రీ టి.జి. వెంకటేశ్, కొలకలూరి ఇనాక్, నాదెండ్ల మనోహర్, ఎల్లా వెంకటేశ్వరరావు, మురళీమోహన్, వేదగిరి రాంబాబు, యర్రంశెట్టి సాయి, గజల్ శ్రీనివాస్ వంటి ప్రముఖులతో వివిధ వేదికల మీద సన్మానించబడ్డారు. తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొని 'కవిమిత్రా'నందం కలిగించారు.

ఈయన ఈ రెండవ కవితా సంకలనం 'పిచ్చోడు' మరింత పేరు ప్రఖ్యాతులు తేవడంతో పాటు ఆయనకి సమాజం పట్ల అవగాహనను సుస్పష్టం చేస్తుంది. సకల జన హితైషి అయిన స్వాప్నికుడి తపన ఇందులో కనిపిస్తుంది.

అన్నట్లు 'మనాశ్రీ' నిజ నామం చెప్పడం ధర్మం కదా!?

**"మద్దూరి నాగాదిత్య శ్రీనివాస్".**

చదవండి! కవి హృదయాన్ని తెలుసుకోండి!! మీరూ తప్పక ఆదరిస్తారు!!!


**దశిక శ్రీనివాస్**

డిప్యూటీ మేనేజర్: ఎస్.బి.ఐ.

జంగారెడ్డిగూడెం, ప॥గో॥ జిల్లా